
గురువులు

ప్రశ్నోత్తరి మణిమాల



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం


గురు దక్షిణామూర్తి


గురు వేదవ్యాస మహర్షి



గురు శుక మహర్షి


గురు నారద మహర్షి


గురు వాల్మీకి మహర్షి


గురు శ్రీకృష్ణ

శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ


గురు బాబాజి


గురు గౌతమ బుద్ధ


గురు ఆదిశంకరాచార్య


గురు రామానుజాచార్యులు


గురు జ్ఞానేశ్వర్


గురు రవిదాస్


గురు కబీర్ దాస్


గురు చైతన్య మహా ప్రభువు



గురు నానక్


గురు రాఘవేంద్ర స్వామి


గురు వీరబ్రహ్మేంద్ర స్వామి


యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి


గురు లాహిరి మహాశయ


గురు రామకృష్ణ పరమహంస


అమ్మ శారదా దేవి


గురు వివేకానంద


గురు సాయిబాబా


గురు అరబిందో


గురు రమణ మహర్షి


గురు యోగానంద


గురు భక్తివేదాంత ప్రభుపాద


గురు మళయాళ స్వామి


గురు విద్యాప్రకాశానందగిరి


గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..





Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తెలుగు భక్తి వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ ఫౌండేషన్ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తెలుగు భక్తి వారి వెబ్ సైట్: www.telugubhakti.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తెలుగు భక్తి వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

http://www.telugubhakti.com/



అతి విశిష్టం ఈ దానం!

"దా"నాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజూ పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ప్రశ్నోత్తరి

మణిమాల

(శ్రీ శంకర భగవత్పాద విరచిత)

వివరణ :

శ్రీ స్వామి మేధానందపురి

సంపాదకులు :

బ్రహ్మచారి వేదచైతన్య జీ

శ్రీమతి పి. లలితశ్రీ

శ్రీ కైలాస ఆశ్రమము

ముని-కి-రేతి, హృషీకేశ్, - 249 201 ఉత్తరాంచల్.

ముక్తికి మార్గం ఈ ప్రశ్నోత్తరి

ఆధ్యాత్మిక క్రాంతి పథమార్గదర్శి

శ్రీ ఆదిశంకర భగవత్పాదులను, సాధారణంగా, శ్రీ శంకరాచార్యులని పేర్కొంటారు. వారు శివావతారమని, కారణజన్ములని చెబుతారు. నిజానికి శ్రీ శంకరాచార్యులవారు ఒక రెబల్‌గా, ఒక క్రాంతి పథమార్గదర్శిగా దాదాపు 12వ శతాబ్దపు సమయంలో అవతరించిన మహాత్ములు వారి విద్వత్తుకు - తర్కానికి సాటి మరెవ్వరూ రారు. వారు ప్రయోగించే తర్కం, పూర్వపక్షులను మూగబోయేలా చేసేది. వారి కాలం నాటికే వైదిక ధర్మం చాలా కలుషితమై పోయింది. రకరకాల మతాలు పుట్టి, ఆధ్యాత్మిక మార్గాన్ని అయోమయంగా మార్చివేశాయి. పరమాత్మ తత్త్వావగాహన ఎంతో సంధిగ్ధంగా మారిపోయింది. ఇలాంటి సంక్లిష్ట స్థితిలో శ్రీ శంకరులు అవతరించి, ఆధ్యాత్మిక మార్గాన్ని కంటక రహితం, సరళం చేశారు. నాడు కలుపు మొక్కల్లా పెరిగి వచ్చిన దాదాపు 72 మతాలను ఖండించి, వాటిని రూపు మాపారు. సమ్యక్ సాధనా వ్యవస్థను, ఉపాసనా మార్గాన్ని ఏర్పాటు చేశారు.

శ్రీ శంకరాచార్యులు ముఖ్యంగా ప్రస్థాన త్రయానికి, సప్రామాణిక - సాధికారిక భాష్యాలు రచియించి, ఆధ్యాత్మిక పిపాసువులకు ఎంతో మేలు చేశారు. ఆ భాష్యాలే కనక లేకపోతే, ఉపనిషత్తులు - బ్రహ్మసూత్రాలు - గీత సవ్యంగా అర్థమయ్యేవే కావు. ఇప్పటికీ శంకర భాష్యాలు, జిజ్ఞాసువులైన ముముక్షువులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

శ్రీ శంకరులు ప్రస్థానత్రయ భాష్యాలేకాక అనేక ఇతర రచనలు చేశారు అంటారు. ప్రకరణ గ్రంథాలు - స్తోత్రాలు - స్తుతులు, ఇలాంటి అనేక రచనలు చేశారని చెబుతారు. నిజం ఏమిటో ఆ శంకరునికే తెలియాలి. మనం మాత్రం అవన్నీ శంకరుని రచనలుగానే స్వీకరించి, మన పురోగతిని సాధించటమే మంచిది.

ఆత్మబోధ, వివేకచూడామణి, ఉపదేశ సాహస్రి, అపరోక్షాను భూతి, భజగోవిందం, ఇలా పందల కొలది రచనలు చేసి శంకరులు ముముక్షు జనానికి ఎంతో ఉపకారం చేశారు.

ప్రశ్నోత్తరి మణిమాల

శ్రీ శంకరుల అసంఖ్యాక రచనల్లో ప్రశ్నోత్తరి మణిమాలకు ఉన్నతస్థానం ఉంది. ఈ ప్రశ్నోత్తరి మణిమాల కు వివరణ రాసిన శ్రీ మేధానందపురిస్వామి గారు, చెప్పినట్లు, ఇది సాధకులకు మార్గదర్శనం చేసే సద్గురువు లాంటిది. బంధం నుండి మనిషిని ముక్తుడిని చేసే సాధనం ఇది. అపార సంసార సముద్రం నుండి తరింపచేసే నౌక ఇది. ఎవడు ముక్తుడు – ఏది నరకం – ఏది స్వర్గం – ఈ సంసారం ఎలా నశిస్తుందీ – మోక్షసాధనం ఏమిటి – ఎవరు సుఖనిద్రను పొందేది – నిజంగా జాగరుకులు ఎవరు – నిజంగా మనిషికి నిజమైన శత్రువులు ఎవరు – నిజమైన మిత్రులు ఎవరు – ఎవరు నిజంగా దరిద్రులు – ఎవరు నిజంగా శ్రీమంతులు – ఎవడు జీవన్మృతుడు – ఏది నిజంగా అమృతం – పాశం ఏదీ – సమ్మోహం ఏదీ – మహాంధుడు ఎవడు – ఏది అసలు మృత్యువు – ఎవరు నిజమైన గురువు – నిజమైన శిష్యుడెవడు – సుదీర్ఘ రోగం ఏమిటి – భవరోగానికి ఔషధ, మేమిటి – భూషణాల్లో భూషణం ఏది – ఉత్తమ తీర్థం ఏది – ఏది అతిహేయమైనది – ఏది వినదగినది – ఎవరు సత్పురుషులు – నిజంగా ఏది జ్వరం – నిజమైన మూర్ఖుడెవరు – ఏది వాస్తవ జీవితం – ఏది అసలైన విద్య – ఏది అసలైన బోధ – ఏది నిజంగా లాభం – ఎవరు జగత్ విజేతలు – ఎవడు మహాశూరుడు – ఎవడు ప్రాజ్ఞుడు – ఏది విషం కన్నా విషం – సదా దుఃఖి ఎవడు – ఎవరు ధన్యులు – ఎవరు పూజనీయులు – ఏది అకార్యం – ఏది సుకార్యం – ఏది సంసారమూలం – ఎవరు విజ్ఞాని – ఏవి నిజమైన సంకెళ్లు – దేనిని తెలిసికొన సాధ్యం కాదు – ఎవరు పశువు – ఎవరి సహవాసం కూడదు – ముక్తికోసం ఏం చేయాలి – ఎవరి జన్మ ప్రశస్తం – ఏది నమ్మదగినది – ఏది అసలు తత్త్వం – ఎవరి జన్మ ప్రశస్తం – ఏది నమ్మదగినది – ఏది అసలు తత్త్వం – ఏది దుఃఖకారణం – ఏది నిర్భయం – అంత్యకాలంలో ఏం చేయాలి – ఎవరు అసలు దొంగ – దేనికి నిజంగా భయపడాలి – ఏది తెలుసుకుంటె అన్నీ తెలుస్తాయి – ఏది దుర్లభం – ఎవరు పశువు – ఏది క్షణికం – ఏది చింతనీయం – దేనిని విశ్వసించరాదు ? – ఇలాంటి అనేక ప్రశ్నలకు, శంకరులు ఆధ్యాత్మిక పరంగా సమాధానాలు చెబుతారు. ఆ సమాధానాలు, సాధకుని శ్రేయస్సాధనలు మంచి సాధనలని చెప్పాలి.

స్వామి మేధానందపురి వివరణ

ఈ ప్రశ్నోత్తర మణిమాలలోని ప్రశ్నలు – జవాబులు సంక్షిప్తంగా – ముక్తసరిగా – సూత్రప్రాయంగా ఉంటాయి. వాటిలోని అంతరార్థాన్ని బయటికి లాగి, స్వామి మేధానందపురిగారు, చక్కని అర్థవంతమైన సాధనోపయోగమైన వివరణను అందించారు. అవసరమైన చోట ప్రామాణిక శ్లోకాలను ఉదహరించారు. శ్రుతి – స్మృతి వాక్యాలతో సమాధానాలను సరళంచేసి, అర్థం చేశారు. ఉదాహరణకు ఒకటి రెండు వివరణలను చూపిస్తాను.

ఎవరితో సాంగత్యం , సహవాసం చేయరాదు ? అన్న ప్రశ్నకు మూర్ఖులతో, నీచులతో , ఖలులతో చేయరాదు. అని శంకరులు సమాధానం చెబుతారు. దాన్ని విశదం చేస్తూ మేధానందస్వామిగారు, వీరి సహవాసంవల్ల ఆధ్యాత్మిక సాధన సాగదు అని వివరణలో కారణం చూపిస్తారు. అలాగే ఏది లఘుత్వం – చిన్నతనం అన్న ప్రశ్నకు శంకరులు అర్థించుట = యాచించుట అని సమాధానం చెబుతారు. ఉన్నవాటితో సంతృప్తి చెందనివారు, ఆడంబరాలను కోరేవారు యాచన చేయవలసి వస్తుందని, తద్వారా దిగజారుతారని, స్వామివారు వివరిస్తారు.

ఇలా స్వామివారి వివరణ ఈ ప్రశ్నోత్తరాల మర్మాన్ని – ఆధ్యాత్మిక గాంభీర్యాన్ని స్పష్టం చేస్తుంది. జిజ్ఞాసువులకు ముముక్షువులకు, సాధకులకు చక్కని మార్గదర్శనం చేస్తుంది.

ఈ ప్రశ్నోత్తరి మణిమాలను ఆధ్యాత్మిక పిపాసువులకు అందచేస్తున్న బ్రహ్మచారి వేదచైతన్యజీ (సాయిరామ్ శర్మాజీ), నా ఏకైక ప్రియ శిష్యుడు. ముముక్షు చకోర విహంగం.

ఈ ప్రశ్నోత్తర మాలిక ప్రక్రియ ద్వారా శ్రీశంకరులు వేదాంతసారాన్ని అత్యంత సరళంగా, ఆకర్షణీయంగా అందించారు. ఈ వేదాంత సారాన్ని గ్రోలి – జీర్ణం చేసుకుని తద్వారా భవబంధాల నుండి ముక్తులమై శాశ్వతానంద స్థితిని, స్వస్థితిని పొందుదుము గాక ! గీత చెప్పినట్లు పరమాం శాంతిం ను ప్రాప్తించుదుము గాక !

ముముక్షువులంతా ముక్తులగుదురు గాక !

హరి ఓమ్ తత్సత్ !

మేధానందులవారి జ్ఞానసిరి... ఈ ప్రశ్నోత్తరి !

స్వామిత్వము, గురుత్వము ఒక వ్యక్తిలో చాలా అరుదుగా ఉంటాయి !

స్వామీజీలందరూ గురువులుగా వుండరు – గురువులందరూ స్వామీజీలై వుండరు !

ఈ రెండు స్థితులను తమ సొంతం చేసుకున్న ఆధ్యాత్మిక మేధావులు శ్రీ మేధానందపురీ స్వామీజీ !

పంచుకుంటే తరిగిపోయేది లౌకిక సంపద. పంచుకునే కొలదీ పెరిగేది ఆధ్యాత్మిక సంపద !

శ్రీ షిర్డిసాయిబాబాగారు నాదగ్గరకు వచ్చే వారంతా లౌకికమైన కోరికలతోనే వస్తున్నారు. నా దగ్గర కుప్పల కొలదీ జ్ఞాన సంపద వుంది. దానిని ఎవ్వరూ అడగరేం ? అని అంటుండేవారు.

అలాగే శ్రీ మేధానందులవారి సమాధానాలలో మనకు అనిర్వచనీయమైన జ్ఞాన సంపద లభిస్తుంది. గతంలో వారు ఆధ్యాత్మిక ప్రశ్నోత్తరి పేరుతో ఆవిష్కరించిన గ్రంథంలో సాధకులు, భక్తులు, సామాన్యులు, సంధించిన సామాన్య, భక్తి, వేదాంత, కర్మ, సాధన, యోగపరమైన వివిధ ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా సమాధానము లిచ్చిరి. ఆ గ్రంథ రాజమునకు సాటిగా ఈ ప్రశ్నోత్తర మణిమాల ద్వారా శ్రీ మేధానందుల వారు తమదైన బాణీలో శ్రీ శంకరాచార్యుల వారి ప్రశ్నోత్తరి మణిరత్న శ్లోకములకు – మాన్యులకూ, సామాన్యులకూ అర్థమగు రీతిలో వివరణ లిచ్చినారు.

ఎంతటి జటిలమైన విషయాన్నైనా సరే లౌకిక దృష్టాంతాలను జోడిస్తూ, ఉదాహరిస్తూ మరెప్పుడు ఆ సందేహము తలెత్తకుండా ఉండే రీతిలో వివరించి చెప్పటం శ్రీ మేధానందుల వారికి వెన్నతో పెట్టి విద్య.

హైద్రాబాద్‌లోని శివానంద ఆశ్రమంలో వారు వారం రోజులపాటు ఈ శ్లోకాలపై వివరణ ఇస్తూ ఉంటే మాకు కాలం తెలియలేదు. మేము అనుభూతించిన జ్ఞానగంగను ఇతరులకు కూడా పంచండి స్వామీ అన్న మా ప్రార్థనను మన్నించి ఇలా పుస్తక రూపం ఇవ్వడం ఆనందకరం !

ఈప్రశ్నోత్తర మణిమాలలో, ఎన్నో మణులున్నాయి. మచ్చుకు కొన్ని ప్రస్తావిస్తాను. ధర్మముల గురించి వివరిస్తూ శ్రీ స్వామీజీ....

సుఖదుఃఖములు మనోధర్మములు జరామృత్యువులు శరీర ధర్మములు ; ఆకలి దప్పులు ప్రాణధర్మములు. శరీరములో ప్రాణములు జడములైన పంచభూతములనుండి ఉత్పన్నమైనవి. అంతఃకరణములో ప్రతిబింబించుచున్న చైతన్యము ద్వారా యివి చైతన్యమువలె ప్రభాసించుచున్నవి. ఈ చైతన్యమే సచ్చిదానంద స్వరూపము. నిరాకార నిర్గుణ తత్త్వము సర్వవ్యాపకము. దీనికి రంగు, రుచి, వాసన, గుణములు లేవు. కనుక సాధారణ సాధకులు మనస్సును దానిపై నిలుపజాలరు. అందులకే సాకార సగుణరూపము లైన శ్రీ రాముడు, శ్రీకృష్ణుడు, దుర్గ మొ॥ దేవతలను ఆధారముగా చేసికొని ధ్యానించుచుందురు. వీరి మీద కూడా మనస్సును నిలుపజాలని వారు ఆధునిక మహాపురుషులైన రామకృష్ణ పరమహంస, షిర్డీ సాయిబాబా, రమణమహర్షి వంటి వారి మీద మనస్సు నిల్పి ధ్యానించెదరు. ఈ సాధకుల ద్వారా పరమాత్మధ్యానమే జరుగుచున్నది. దీనినే ఆది శంకరాచార్యులు పరమాత్మ పాదపద్మరూపముల ఓడయే సంసార సాగరమున మునిగినవారికి శరణమని చెప్పిరి.

.... ఎంత చక్కటి వివరణ ! సామాన్యులకు, సాధకులకు మంచి సందేశము. దేవతలను పదలిపెట్టి మహాత్ములను, మహా పురుషులను పూజించుటంలో ఫలితముందా ? అని ప్రశ్నించేవారి సంకోచానికి, సంకుచితత్వానికి గొడ్డలిపెట్టు ఇది.

ఆత్మజ్ఞాని గురించి వివరిస్తూ శ్రీ స్వామీజీ కిమిచ్ఛన్ కన్య కామాయ ! జ్ఞానికి ఏవిధమైన ఇచ్ఛ ఉండదు. జగత్ మిథ్య అయినందువలన వాస్తవమునకు కోరవలసిన పదార్థము లేనందున దేనినీ కోరడు. అనిత్య సంసారములో కోరవలసిన విషయములేవి కలవు ? ఆత్మ అసంగమైనందున ఆ చైతన్య స్వరూపమున కేమీ అక్కరలేదు. అందుకే కస్యకామాయ – ఎవరికొరకు కోరును. ఇచ్ఛట జ్ఞాని యొక్క స్థితి మరియు వాని స్వరూపానుసంధానము వర్ణింపబడినది. జ్ఞానియగుటకు లేక సమాధిస్థితి పొందుటకు మొదట కర్మలను నిస్స్వార్థభావముతో చేయవలయును. ఆ తరువాత తీవ్రమైన ఉపాసన గావించవలెను. తదుపరి శ్రవణ, మనన, నిదిధ్యాసములతో కూడిన వేదాంత విచారణ చేయవలెను. సమాధిస్థితికి ఆటంకములైన మల, విక్షేప, ఆవరణలు పైచెప్పిన రీతిగా తొలగును. ఏ సాధకులైతే యీ స్థితిని పొందిరో వారినే పరమాత్మ స్వరూపములో సమాధినిష్ఠులై యున్నారనియు, వారే వాస్తవమునకు సుఖముగా నిద్రించువారని శ్రీ శంకర భగవత్పాదులు చెప్పిరి.

శీలము గురించి ప్రస్తావిస్తూ చాలా చక్కని సందేశము అందించారు శ్రీస్వామీజీ ధనము నష్టమైన తిరిగి సంపాదించు కొనవచ్చును. ఆరోగ్యం చెడినను మరల పుంజుకొనవచ్చును. కాని చరిత్ర నష్టమైన సర్వమూ నాశనమైనట్లే।

గీతలో కామ, క్రోధముల వలననే ప్రణశ్యతి అని చెప్పిరి, అనగా ప్రకర్షేణ నశ్యతి దీనికి అర్థము పూర్తిగా నశించును అని. శీలము చెడిన వేరుగా చెప్పనవసరము లేదు. వారికి పరలోక ద్వారం పూర్తిగా మూసివేయబడినది.

ఇతి హాసములో సీతాదేవిని మించిన శీలవతి లేదు ; రాముని మించిన ధర్మాత్ముడు లేడు, అందులకే యుగములు దాటినను వారి నామములు శ్రద్ధతో కీర్తించుచున్నారు. శీల నిర్మాణము చేయు విద్యాభ్యాసము ఈ కాలములో చాలా ఆవశ్యకము, స్వధర్మాచరణ లేనిదే శీలనిర్మాణమునందు పటిష్ఠత లేదు. కనుకనే చరిత్ర రక్షణకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించవలెను. అందులకే యిచ్చట అలం కారములలో ఉత్తమ అలంకారము శీల మని చెప్పిరి.

దుఃఖ కారణములు గురించి తెలుపుతూ విషయాను రాగమే ఎల్లప్పుడు దుఃఖమునకు కారణము, ఇంద్రియముల తేజస్సును హరింపజేయును – జరయంతి తేజః ఒక కాకికి మాంసపు ముక్క దొరికిన దానిని తినుటకై మిగిలిన కాకులు దానిని చేరి పొడుచుచుండును. అప్పుడది ఆ మాంసపు ముక్కను జారవిడిచి ఏకాంతముగా పోయి శాంత చిత్తముతో చెట్టుపై కూర్చుండును. అట్లే విషయములకై అందరూ ఎగబడుచూ, ఒకరితో ఒకరు దెబ్బలాడుచూ, నేనుముందు నేనుముందు అని పోటీ పడుచుందురు. విషయములను వదలిపెట్టినవారు మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థించుచు శాంతిని పొందెదరు. సందేశాత్మకంగా పలికారు శ్రీ స్వామీజీ.

సత్సాంగత్యము గురించి వివరిస్తూ మూర్ఖుల సాంగత్యము, మరియు వారితో ఉండుటవలన వివేకము నశించును. నీచులతో నుండుట వలన కుత్సితస్వభావము లేర్పడును. దుష్టులతో నుండిన క్రూర స్వభావము, పాపులతో నుండిన నరకము లభించును. వీనివల్ల ఆధ్యాత్మిక సాధన సాగదు ; మరియు ఉన్నతిని పొందలేరు గనుక వీరి సాంగత్యము, సహవాసము చేయరాదనిరి. అటువంటి వారి నుండి ఆహారము గ్రహించిన బుద్ధి నశించును. మూర్ఖులు మొదలైన వారితో కాలక్షేపము చేయుటకంటె ఏకాంతముగా నుండి భజనచేయుట మేలు. శౌచమనగా శుభ్రత. ఆంతరిక శుభ్రత, బహిరంగ శుభ్రత వీరిలో (మూర్ఖులలో) యుండదు. అదికూడా సాధనాపరులకు ఆటంకమే గదా ! అని తెలిపారు శ్రీ మేధాసందపురి స్వామీజీ.

శ్రీ శంకర భగవత్పాద విరచిత

ప్రశ్నోత్తరి

1) శ్లో॥అపారసంసారసముద్రమధ్యే
సమ్మజ్జతో మే శరణం కిమస్తి ?
గురో కృపాలో కృపయా వదైత
ద్విశ్వేశపాదాంబుజదీర్ఘనౌకా ॥

1) ప్ర॥ దయాస్వరూపుడైన గురుదేవా ! సంసారసముద్రములో మునిగిన నాకు శరణమెవరో కృపతో చెప్పగలరు.

జ॥ జగద్రక్షకుడైన పరమాత్మ యొక్క పాదపద్మముల రూపములో నున్న ఓడయే సాగరమునుండి నిన్ను దాటించును.

వివరణ : మొదట పరమాత్మయొక్క పునికిని తెలుపుటకు కొన్ని తర్కములు తెలిపెదము. శరీరము నవరంధ్రములుగల తోలుతిత్తి. దీనిలో ప్రాణవాయువు నిలుచుటయే ఆశ్చర్యము. ప్రాణం పోయిన మృతకళేబరమును ఎవరూ దాచిపుంచరు గదా ! గాఢనిద్రావస్థలో శరీరము, ఇంద్రియములు, మనోబుద్ధిచిత్త అహంకారములు పనిచేయకున్నను జీవి ఆనందమును అనుభవించుచున్నాడు. ఈ అనుభవించు చైతన్యమే పరమాత్మ. కుండచేయుటకు కుమ్మరి అవసరము. అట్లే సూర్య, చంద్ర, నక్షత్రాదులు, 14 లోకములు సృష్టించుటకు ఒక కర్త పుండి తీరవలెను. ఆకర్తయే పరమాత్మ ! ధ్యానములో పున్న సాధకునికి మనస్సు ధ్యేయవస్తువుపై నిలబడదు. అంటే తన అహంకారముకన్న వేరొక చైతన్యశక్తి పూర్వసంస్కారముల కనుగుణముగా మనస్సును పదిదిక్కులకు పరుగెత్తించుచున్నది. అందుకే గీతలో (18-61)
ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।

భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥

పై చెప్పిన తర్కముల వలన పరమాత్మయొక్క ఉనికిని స్పష్టముగా తెలుసుకొనగల్గుచున్నాము. ఇపుడు వివేకము మరియు సాధన గురించి విచారించెదము.

సుఖదుఃఖములు మనోధర్మములు ; జరామృత్యువులు శరీర ధర్మములు ; ఆకలి దప్పులు ప్రాణధర్మములు. శరీరములో ప్రాణములు జడములైన పంచభూతములనుండి ఉత్పన్నమైనవి. అంతఃకరణములో ప్రతిబింబించుచున్న చైతన్యము ద్వారా యివి చైతన్యములవలె ప్రతిభాసించుచున్నవి. ఈ చైతన్యమే సచ్చిదానంద స్వరూపము. నిరాకార నిర్గుణ తత్త్వము సర్వవ్యాపకము. దీనికి రంగు, రుచి, వాసన, గుణములు లేవు, కనుక సాధారణ సాధకులు మనస్సును దానిపై నిలుపజాలరు. అందులకే సాకార సగుణరూపములైన శ్రీ రాముడు, శ్రీకృష్ణుడు, దుర్గ మొ॥ దేవతలను ఆధారముగా చేసికొని ధ్యానించుచుందురు. వీరి మీద కూడా మనస్సును నిలుపజాలని వారు ఆధునిక మహాపురుషులైన రామకృష్ణపరమహంస, షిర్డీసాయిబాబా, రమణమహర్షి వంటి వారి మీద మనస్సు నిల్పి ధ్యానించెదరు. ఈ సాధకుల ద్వారా పరమాత్మధ్యానమే జరుగుచున్నది. దీనినే ఆదిశంకరాచార్యులు పరమాత్మ పాదపద్మరూపముల ఓడయే సంసార సాగరమున మునిగినవారికి శరణమని చెప్పిరి.

2) శ్లో॥బద్ధో హి కో యో విషయానురాగీ
కా వా విముక్తిర్విషయే విరక్తిః ।
కో వాస్తి ఘోరో నరకః స్వదేహః
తృష్ణాక్షయః స్వర్గపదం కిమస్తి ॥

1. ప్ర ॥ బంధనములో నున్న వారెవరు ?
జ॥ విషయములందు ఆసక్తి గలవారు.

2. ప్ర॥ దేనిని ముక్తియందురు ?
జ॥ విషయవస్తువులపై గల వైరాగ్యమే ముక్తియందురు.

3. ప్ర॥ ఘోరమైన నరకమేది ?
జ. ఘోరమైన నరకమే ఈ శరీరం

4. ప్ర॥ స్వర్గపదమేది ?
జ॥ తృష్ణానాశనమే స్వర్గపదము

వివరణ : శబ్ద, స్పర్శ, రూప, రస గంధములకు లోబడి జింక, ఏనుగు, మిడత, చేప, తుమ్మెద, ఈ ఐదున్నూ ఒక్కొక్క ఇంద్రియమునకు లోబడి ప్రాణము కోల్పోవుచున్నవి. **5** ఇంద్రియముల విషయములకు లోబడిన మనిషియొక్క గతిని వేరే చెప్పాలా ?

ధాతువు : షిఞ = బంధనే విశేషేణ బధ్నాతి ఇతి విషయః అందులకే మోక్షగామి విషయవైరాగ్యమును పెంపొందించుకొనవలెను.

యోగులకు, మహాపురుషులకు కూడా శరీర భావన కొద్దియో, గొప్పయో యుండును. కాని వారియొక్క వివేకము అతి తీక్షణముగా నుండుటచే బహిర్గతమైన శరీర భావననుండి అంతర్ముఖమైన ఆత్మభావనలోనికి అతిత్వరగా ప్రవేశించగలరు. అనేక జన్మల సాధన వలన లేక కారణజన్ములగుట వలన యింకా చెప్పాలంటే పరమేశ్వర కృపవలన వారు ఆస్థితికి రాగలిగారు, కాని, సాధారణ సాధకునికి జీవితాంతము శరీరాభిమానము సమసిపోదు. అందులకే తీవ్రసాధన చేయుచు జాగ్రదవస్థలో కొన్ని క్షణములైనా శరీరాభిమానమును వదిలి ఆత్మచింతనలో యుండుటకు ప్రయత్నించవలెను. దేహ బుద్ధ్యాతు దాసోఽహం శరీరాభిమానము త్వరగా నశించదు కనుక, ఆంజనేయుల వారికన్న రెండాకులు ఎక్కువచదువలేదు కనక, ఈ శరీరాన్ని పరమాత్మయొక్క దాసునిగా భావించి అందరిలో వున్న పరమాత్మయొక్క సేవచేయుచున్న – శరీరాభిమానము తగ్గు సూచనలు కన్నించును. లేనిచో భగవత్పాదులు చెప్పినట్లు యీ శరీరమే ఘోరనరకముగా భాసించును.

మనిషిలోని ఇచ్చలు సంస్కారతారతమ్యం వలన నాల్గురకములు అవి వరుసగా వాసన, ఇచ్ఛ, కామన మరియు తృష్ణ.

1. వాసనలు : ఇవి పిల్లలలో ఉండును. ఇవి అనుద్భూత రూపములో వుండును ; అనగా అజాగరూకతగా వున్నవి.

2. ఇచ్ఛ : ఇచ్ఛలనే స్పృహలందురు. మిథ్యాప్రపంచములోని విషయముల సౌందర్యము మాటిమాటికి చూసి ఆ విషయ వస్తువులు కావలెననెడి కోరికనే స్పృహయందురు.

3. కామన : ఈ ఇచ్ఛ తీవ్రమైన కామనగా మారును. విషయ వస్తువులు తప్పక దగ్గర వుండవలెను, తప్పక అనుభవించవలెననునదే ఈ కామనాస్వరూపము.

4. తృష్ణ : కామన తీవ్రమైన మనిషిని పిచ్చివానిని చేయును ; దానినే తృష్ణ యందురు. అందుకే నీతికారులు – కామాతురాణాం నభయం నలజ్జ అనిరి. బిడియము, భయము పదిలి పిచ్చివానివలె విషయముల వెంటపడుటయే తృష్ణయందురు. వాసన కారణము; తృష్ణ కార్యము. ఈ వాసనా, తృష్ణ, కామనా నాశనమే స్వర్గమునకు సోపానమని భగవత్పాదులు నుడివిరి.

3. శ్లో॥సంసారహృత్కృ శ్రుతిజాత్మబోధః
కో మోక్షహేతుః కథితః స ఏవ ।
ద్వారం కిమేకం నరకస్య నారీ
కా స్వర్గదా ప్రాణభృతామహింసా ॥

1. ప్ర॥సంసారము దేనివలన నశించును ?

జ॥ వేదములద్వారా ఉత్పన్నమయిన ఆత్మజ్ఞానము వలన నశించును.

2. ప్ర॥దేనిని మోక్షకారణమనిరి ?

జ॥ పైన చెప్పిన ఆత్మజ్ఞానమే మోక్షము

3. ప్ర॥ నరకమునకు ద్వారమేది ?

జ॥ నారియే నరకమునకు ద్వారము

4. ప్ర॥ ఏది స్వర్గమునిచ్చును ?

జ॥ జీవ భూతములయందు అహింసయే స్వర్గము నిచ్చును.

వివరణ : హిందూధర్మమునకు వేదములే పట్టుకొమ్మ. వేదముల అంతిమ భాగమునే ఉపనిషత్తులందురు. వేదాంతసారం –

బ్రహ్మ సత్యం, జగన్మిథ్య, జీవోబ్రహ్మైవ నాపరః ।

ఉపనిషత్తుల సారమే భగవద్గీత. ఉపనిషత్తులలోని విరోధాభాసమును తొలగించునది బ్రహ్మసూత్రములు. ఉపనిషత్, బ్రహ్మ సూత్ర భగవద్గీతలనే ప్రస్థానత్రయమందురు.

అధ్యారోప, అపవాదముల ద్వారా నిరాకార, నిర్గుణ బ్రహ్మమును ఉపనిషత్తులలో ప్రమీణీకరింతురు. జీవాత్మ, పరమాత్మ కూడా ఒకటేనని నిరూపింతురు. నిర్గుణ బ్రహ్మమునుండి సూక్ష్మపంచభూతముల సృష్టి, వాని పంచీకరణద్వారా స్థూలభూతములు, విరాట్ జగత్సృష్టిని చెప్పి, సృష్టియంతా జడస్వరూపమని నిరూపించి దానికి ఆధారము చైతన్యమేననియు, బోధింతురు. ఈ విషయమును తెలుపు శ్లోకము బ్రహ్మగీత యందు ఈ విధముగా నున్నది.

స్వయం భాతు మశక్తం హి జడాత్మక మిదం జగత్ ।
చిత్సంబద్ధ బలేనైవ ఖలుభాతి నచాన్యథా ॥

ఆ చైతన్యమే మనస్వరూపమని మహావాక్యముల ద్వారా నిరూపింతురు. దీనినే యిచ్చట భగవత్పాదులు వేదములద్వారా ఉత్పన్నమైన ఈ ఆత్మజ్ఞానమే సంసారమును నశింపజేయునని చెప్పిరి. ఈ ఆత్మజ్ఞానమే మోక్షమునకు కారణమని చెప్పిరి.

పురుష సాధకులకు స్త్రీలపై వ్యామోహము, స్త్రీ సాధకులకు పురుషులపై వ్యామోహము నరకమునకు ద్వారము, శరీరముపై నున్న వ్యామోహము నశించనంత వరకు కామము కూడా నశింపదు.

శక్నోతీహైవ యఃసోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం సయుక్తః స సుఖీ నరః ॥ (గీ 5-23)

శరీరము విడుచుటకు ముందు యీ జన్మమునే కామక్రోధముల ద్వారా ఉత్పన్నమైన వేగము సహించగల సమర్థుడే యోగి అనబడును. అతడే నరుడు.

గీత **16**వ. అధ్యాయం **21**వ శ్లోకములో కామము, క్రోధము, లోభము యీ మూడును ఆత్మను నశింపజేయు నరకద్వారములని చెప్పిరి. కనుకనే యీ మూడింటిని త్యజించుటకు ప్రయత్నము చేయవలయును. సాధారణముగా యీ కామాతురులే అడ్డత్రోవలు త్రొక్కుచు ధనాపహరణము చేయుదురు. అంతేగాక అనేక నీచకృత్యములు చేయుదురు. అటువంటి వారికి నరకము గాక స్వర్గము దొరకునా ? కనుకనే భగవత్పాదులు నరకద్వారము నారి (కాముము) అనిరి.

వేదముల సారము ఏకం సత్ విప్రా బహుధా వదంతి, ఉన్న ఆత్మ ఒకటే ! దానినే పండితులు బహుప్రకారము వర్ణింతురు. ఆ పరమాత్మ ఒకడే అందరిలో సమముగా ఉన్నాడు. దీనినే గీత **5**. అ **18** శ్లో (**5-18**)

విద్యావినయసంపన్నే । బ్రాహ్మణే గవి హస్తివి ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ అన్నారు

అందరూ సుఖమునే కోరుదురు. సంపూర్ణసుఖము ఆత్మజ్ఞానము వలననే లభించును. కనుక వివేకముగల బుద్ధిజీవి ఆత్మజ్ఞానమునకే ప్రయత్నించవలయును. అట్టివారు అహింసా ధర్మమునే పాటించవలెను ; అందరిలోవున్న ఆత్మ ఒకటే గనుక ! దీనినే ఆదిశంకరులు జీవుల అహింసయే స్వర్గము నిచ్చునదని చెప్పిరి.

4. శ్లో॥శేతే సుఖం కస్తు సమాధినిష్ఠో
జాగర్తి కో వా సదసద్ వివేకీ ।
కే శత్రవః సంతి నిజేంద్రియాణి
తాన్యేవ మిత్రాణి జితాని యాని ॥

1. ప్ర॥ (నిజంగా చెప్పాలంటే) సుఖముగా నిద్రించువారెవరు ?
జ॥ పరమాత్మ స్వరూపముసందు సమాధి నిష్ఠులైనవారు.

2. ప్ర॥ ఎవరు జాగరూకులైయున్నారు ?
జ॥ నిత్యానిత్య వివేకము గలవారు.

3. ప్ర॥శత్రువులు ఎవరు ?
జ॥ తన యొక్క యింద్రియములు. వానిని జయించినచో అవి మిత్రులగును.

వివరణ : ఆత్మజ్ఞానిని గురించి తెలుపుతూ ఉపనిషత్తులలో యిలా అన్నారు. కిమిచ్ఛన్ కస్య కామాయ । జ్ఞానికి ఏ విధమైన ఇచ్ఛ ఉండదు. జగత్ మిథ్య అయినందువలన వాస్తవమునకు కోరవలసిన పదార్థము లేనందున దేనినీ కోరడు. అనిత్య సంసారములో కోరవలసిన విషయములేవి కలవు ? ఆత్మ అసంగమైనందున ఆ చైతన్య స్వరూపమున కేమీ అక్కరలేదు. అందుకే కస్యకామాయ - ఎవరికొరకు కోరును. ఇచ్ఛట జ్ఞాని యొక్క స్థితి మరియు వాని స్వరూపాను సంధానము వర్ణింపబడినది. జ్ఞానియగుటకు లేక సమాధిస్థితి పొందుటకు మొదట కర్మలను నిస్స్వార్థభావముతో చేయవలయును. ఆ తరువాత తీవ్రమైన ఉపాసన గావించవలెను. తదుపరి శ్రవణ, మనన, నిదిధ్యాసములతో కూడిన వేదాంత విచారణ చేయవలెను. సమాధిస్థితికి ఆటంకములైన మల, విక్షేప, ఆవరణలు పైచెప్పిన రీతిగా తొలగును. ఏ సాధకులైతే యీ స్థితిని పొందిరో వారినే పరమాత్మ స్వరూపములో సమాధినిష్ఠులై యున్నారనియు, వారే వాస్తవమునకు సుఖముగా నిద్రించువారని శ్రీ శంకర భగవత్పాదులు చెప్పిరి.

ఈ సంసారము మూడునాళ్ళ ముచ్చటని అందరికి తెలిసినదే ! శరీరమే వుండదు, అయినప్పటికిన్నీ అజ్ఞానజీవులు ఈ ప్రపంచమే నిత్యమని భావించి దానికై శ్రమపడుచుందురు. పరమాత్మ చింతన చేయనే చేయరు. పూర్తిగా మనస్సు సంసారములో కేంద్రీకరించి పరమాత్మ కృపలేదని భావింతురు. దీనికి వ్యతిరేకముగా వివేకశీలురు నిత్యమైనది పరమాత్మ ఒక్కడే అని, ప్రపంచము అనిత్యము అని తెలిసికొని సర్వవేళ సర్వావస్థల యందు నిత్యానిత్య వస్తు వివేకము కావింతురు. అట్టివారిని భగవత్పాదులు మేలుకొనిన వారిగా చెప్పిరి. మిగిలిన వారందరు అజ్ఞాన నిద్రలో మునిగినవారే !

సాధకుడగు వివేకముగల మనుష్యుని మనస్సును దుఃఖములకు కారణములగు యింద్రియములు బలవంతముగా విషయముల వైపుకు ఆకర్షించును. పరమాత్మపై నిష్కలవాడు ఇంద్రియముల సదువులో వుంచుకొని భక్తిపరుడై మెలగును.

ఎవరి యింద్రియములదుపులో నున్నవో వారి బుద్ధి స్థిరముగా నున్నదని గీతోక్తి. ఈ యింద్రియములనే భగవత్పాదులు యిచట శత్రువులని చెప్పిరి. ఈ యింద్రియములను వశముగావించుకొన్న అవే మనకు మిత్రులగునని కూడా చెప్పిరి.

5. శ్లో॥ కో వా దరిద్రో హి విశాలతృష్ణ
శ్రీమాంశ్చ కో యస్య సమస్తతోషః ।
జీవన్మృతః కస్తు నిరుద్యమో యః ।
కిం వామృతం స్యాత్ సుఖదా నిరాశా ॥

1. ప్ర॥ దరిద్రుడు ఎవరు ?

జ॥ విశాలతృష్ణ గలవాడు అనగా అధికతృష్ణ గలవాడు.

2. ప్ర॥ ధనవంతుడెవడు ?

జ॥ అన్ని రకముల సంతోషము గలవాడు.

3. ప్ర॥ వాస్తవమునకు జీవించియుండిగూడా మరణ సమానుడెవడు ?

జ॥ పురుషార్థహీనుడు.

4. ప్ర॥ అమృత మేదగును ?

జ॥ సుఖమునిచ్చు నిరాశ అనగా ఆశా రాహిత్యము.

వివరణ : ఇహ చేద్అవేదీత్ అథ సత్యమస్తి న చేదిహావేదీన్మహతీ వినష్టిః ॥ (కేప ॥ ఉ॥ **2-4**)

ఈ జన్మమందు స్వస్వరూపమైన ఆత్మను, సర్వవ్యాపకమైన పరమాత్మను ఒకటిగా తెలిసికొనినచో అతనికి సత్యమైన బ్రహ్మానందము కలుగును. ఈ జ్ఞానము కలగనిచో గొప్ప వినాశనము సంభవించును, కనుక ఉపనిషత్తుల ఘోష ఆత్మజ్ఞానమును పొందుట గాని, తీరని కోరికలను ప్రాపంచిక విషయములపై పెంపొందించు కొనుటకు గాదు.

వేదములన్నియు, గీతలన్నియు ప్రపంచమును అనిత్యముగనే చాటుచున్నవి. అందులకే అత్యంత అవసరములైన తిండి, బట్ట నివాసాదులను మాత్రమే కోరుచు ఎల్లప్పుడూ పరమాత్మచింతన చేయవలెను. అట్లు గాక గొంతెమ్మ కోరికలు కోరుచున్న మనస్సు బహిర్ముఖమై గమ్యమునకు దూరమగును. అందుకే గీతలో బహిరింద్రియ నిగ్రహము, అంతరింద్రియ నిగ్రహము చెప్పబడినది. విషయచింతనవలన మనిషికి వానియందు ఆసక్తి కలుగును. ఆసక్తి నుండి కామము, కామము నుండి క్రోధము కల్గుచుండును. క్రోధము నుండి అవివేకము, అవివేకమునుండి స్మృతి లోపము కల్గుచుండును ; స్మృతి భ్రంశమైన సదసద్విచారము నశించును ; వివేకము నశించిన మనుజుడు పురుషార్థము నుండి పంచింపబడును. అందులకే భగవత్పాదులు విశాలతృష్ణగలవాడే దరిద్రుడు అనిరి.

ఏది దొరికిన దానితో సంతోషించువాడు, శీతోష్ణాది ద్వంద్వ రహితుడు, లాభాలాభములయందు సమబుద్ధి గలవాడు, అయిన పురుషుడు విహిత కర్మలను లేక స్వాభావికమగు శరీర రక్షణకు అవసరమైన కర్మలను ఆచరించినను బంధనములో పడడు ; ఇది గీతోక్తి. గీతలో ఏది దొరికిన దానితోనే సంతోషించుమని చెప్పినారు. అట్లే యిక్కడ భగవత్పాదులు అన్నిరకముల సంతోషముగలవారే ధనవంతులని చెప్పినారు.

మన ప్రస్తుత పరిస్థితికి పూర్వకర్మలు కారణమైతే, రాబోవు జన్మకు యిప్పటి కర్మలు కారణమగును. అందుకే భవిష్యత్తును వర్తమానకర్మల ద్వారా చక్కదిద్దుకొనవలెను. అజాగ్రత్త, సోమరి తనములకు అవకాశమివ్వరాదు. కార్యసిద్ధి ప్రయత్నము వలననే లభించును. గాలిలో మేడలు కట్టిన లభించవు. ఉద్యమ రహితముగా నిద్రించు సింహము నోటిలోనికి జంతువులు వాటంతట అవే ప్రవేశించవు గదా ! అందుకే ఎల్లప్పుడు అభ్యాసము చేయవలయును. పోరాటమే జీవనము, కనుక లక్ష్యమునకై ఉద్యమించువాడే నిజంగా జీవించువాడు. అట్టి ఉద్యమము లేనివానిని యిచట జీవన్మృతుడనిరి ; అనగా జీవించియుండగానే మరణించిన వాడు.

ఆశాపాశము తాకడున్ నిడువు లేదంతంబు రాజేంద్ర,

ఇది దానము చేయుచున్న సమయమున శుక్రాచార్యులకు బలి చక్రవర్తి చెప్పిన మాట. ఆశకు అంతము లేదు. ఈ ఆశవలనే దుర్యోధనుడు బంధుమిత్రాదులను, రాజ్యమును కోల్పోయెను. దీని వలననే రావణుడు వంశముతో సహా

నాశనమయ్యెను. వర్తమానమున కడుపునిండని ఈ ఆశతో రాజకీయనాయకుల స్థితి మనకు తెలిసినదే ! కనుకనే భగవత్పాదులు ఆశారహితమే సుఖమునొసగును, ఇదియే అమృతమగును అనిరి.

6. శ్లో॥ పాశో హి కో యో మమతాభిమానః
సమ్మోహయత్యేవ సురేవ కా స్త్రీ ।
కో వా మహాంధో మదనాతురో యో
మృత్యుశ్చ కో వాపయశః స్వకీయమ్ ॥

1. ప్ర॥ వాస్తవంగా బంధనమేది ?
జ॥ మమకార, అహంకారములు. (మమత, అభిమాన ములు) బంధనములు అనగా పాశములు.

2. ప్ర॥ మద్యమువలె నిశ్చయముగా మోహించునదేది ?
జ॥ స్త్రీ యే.

3. ప్ర॥ గొప్ప గ్రుడ్డివాడు ఎవడు ?
జ॥ కామవశమున వ్యాకులత చెందినవాడు.

4. ప్ర॥ మృత్యువేది ?
జ॥ తనయొక్క అపకీర్తియే మృత్యువు.

వివరణ : పరమేశ్వరుడు ఈసృష్టిగావించి, అతి సుందరమైన మానవ దేహమును సృష్టించి, వాని హృదయములో మమతాభిమానములు ఉంచెను. దీనివల్ల జీవుడు పరమేశ్వరుని నుండి దూరమగుచున్నాడు, ఎవరికి వారే యమునా తీరే అని అందరికి తెలుసు, అయినను మమతవలన భార్యాపుత్రులయందు మమకారము పెంచుకొను చున్నాడు.
అభిమానము వలన దేవునికి దూరమై సంసారములో చిక్కుకొనుచున్నాడు. చైతన్య మహాప్రభువులు జీవితలక్ష్యమును యీ విధముగా నుడివిరి.

తృణాదపి సునీచేన । తరోరివ సహిష్ణునా ।
అమానినామానిదేన । కీర్తనీయ స్సదాహరిః ॥

అనగా పెద్దగాలివాన వీచినపుడు గడ్డివరక నేలకంటుకుని పోవును. అందువలన దానికి ఏవిధమైన హాని కలుగదు. అదే విధముగా నిరహంకారి అయిన సాధకుని ఎవరు ఏమి చేయలేరు. ఇంతేగాక పరమేశ్వరుని కూడా పొందును. పండ్లతోనిండిన చెట్టు క్రిందికి వంగును ; రాళ్ళువేసిన పిల్లలకు పండ్లను ఇచ్చును ; గొడ్డలితో కొట్టిన కలపవచ్చును; ఈ విధముగా మమతాభిమానములు లేని వ్యక్తి భగవద్భక్తుడు. మూడవపాదములో మానావమానములు సమానముగా చూడవలెననియు, నాల్గవ పాదములో అన్నివేళలందు, హరిని కీర్తించవలెననియు చెప్పిరి. అట్లే ఆత్మ పురాణములో –

అభిమానం సురాపానం । ప్రతిష్ఠా సూకరీ విష్ఠా ।
గౌరవం ఘోరరౌరవం । త్రిణిం త్యక్త్వా సుఖీ భవ ॥

అందులకే భగవత్పాదులు మమతాభిమానములు బంధనములనిరి. వీరివలననే మనస్సు బహిర్ముఖమై మోహములో పడి, స్త్రీని పొందుటకై తహతహలాడును. గీతలో కృష్ణపరమాత్మ ఈ కామమునే మహాశనో మహాపాప్మా అనిరి. అనగా తృప్తి పరుపరానిది, అతి ఉగ్రమైనది, పాపరూపమైనదీ కామము. అందులకే యిచ్చట ఆదిశంకరాచార్యులు స్త్రీ మద్యము వలె నిశ్చయముగా మోహింప జేయుననిరి. నీతికారులు కామాతురాణాం న భయం లజ్జా న అనిరి. ఈ కాలములో శాస్త్రమర్యాదలనుల్లంఘించి, పెద్దలమాట విస్మరించి, వాని పరునలుతప్పి, కులమత భేదములు వదలి, కొంతమంది కామాతురులై యుండుట చూచుచునే యున్నాము. అట్టి వారిని ఆదిశంకరులు గొప్ప గుడ్డివారనిరి.

ఒకసారి రాజసభలో రాజుగారు పరువున్న పెద్దమనిషిని నిలదీసి మీ బోంట్లు యిట్లు చేయుట తగదనిరి. ఆ పెద్ద మనిషి సభలో జరిగిన అవమానమునకు సహింపని వాడై యింటికి వచ్చి విషముత్రాగి చనిపోయెను. దీనినే గీతలో కృష్ణపరమాత్మ –

సంభావితస్య చాకీర్తిర్మరణా దతిరిచ్యతే, అనిరి. అనగా లోకమాన్యుడగు వానికి అపకీర్తి మృత్యువుకంటెను దుఃఖదాయకము. అందులకే తనయొక్క అపకీర్తి మృత్యుసమానమని చెప్పిరి.

7) శ్లో॥కో వా గురుర్యో హి హితోపదేష్టా
శిష్యస్తు కో యో గురుభక్త ఏవ ।
కో దీర్ఘరోగో, భవ ఏవ సాధ్యో
కిమౌషధం తస్య విచార ఏవ ॥

1. ప్ర॥ గురువెవరు ?

జ॥ కేవలము హితమును పదేశించువారు.

2. ప్ర॥ ప్రశిష్యుడెవరు ?

జ॥ గురుభక్తి గలవాడు శిష్యుడు; అంటే గురువు యందే భక్తి కలవాడు.

3. ప్ర॥ అనాదిగా వున్న రోగమేది ?

జ॥ సంసారరోగము అనాదిగా వున్నది ; అంటే మరల మరల జన్మమెత్తుట

4. ప్ర॥ ఈ భవరోగమునకు మందు ఏమి ?

జ॥ పరమాత్మ యొక్క స్వరూపమును చింతన చేయుటయే ఔషధము.

వివరణ : గురువు అనగా అజ్ఞానము నశింపజేయువాడు. అట్లే శిష్యుని స్థాయి, గుణములు, బుద్ధి అనుసరించి వానికి సరైన మార్గము చూపుచు కేవలము వాని ఆధ్యాత్మిక అభివృద్ధి కొఱకై శాస్త్రోపదేశము చేయువాడు, శాస్త్రములను బాగుగా చదివి, వానియొక్క తాత్పర్యము అవగాహన చేసికొని, ఆ ధర్మములను స్వయముగా తన జీవితములో ఆచరించుచు, ఇతరులచేత ఆచరింపజేయువాడే గురువు. శిష్యునకు కావలసిన వర్ణాశ్రమ ధర్మములు చెప్పుచూ, ఆశ్రమమునకు సంబంధించిన సంస్కారములను వానికి చేయుచు, సన్మార్గములో ప్రవర్తించునట్లు చేయువారే గురువులు.

అందులకే భగవత్పాదులు కేవలము శిష్యుని హితమునకే ఉపదేశించు వారే గురువులు అనిరి.

గురుగీతయందు గురువునే బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపమని తెల్పిరి. సాధకునికి, లేక సాధక శిష్యునకు గురువుల ఆరాధనకర్తవ్యము మరియు తన జీవితమునే గురువు కర్పించవలెను. మల, మూత్ర మాంసాదులైన నికృష్ణ వస్తువులు గల శరీరముతో గురువుల సేవ చేయుచు దానిని (శరీరమును) సార్థకమొనరించు కొనవలెను. శిష్యునిపై శివుడు కోపించినను గురువు రక్షించును. గురువు కోపించిన శివుడు రక్షించలేడు. గురువుల స్వరూపము అత్యంతము అమృతతుల్యము.

అందులకే మోక్షగామి శిష్యుడు ఎల్లప్పుడూ గురువుయందు భక్తి గల్గి యుండవలెను.

యస్య దేవే పరా భక్తి యథా దేవే తథా గురౌ ॥
తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః ॥ (శ్వే.ఉ.6-23)

ఎవరికి దేవునిమీద ఉన్నంత భక్తి గురువుమీద కల్గియుండునో అట్టి మహాత్ములకు శాస్త్రములందు చెప్పిన విషయములు అనుభవమునకు వచ్చుచుండును. గురూపదేశము, స్వానుభవము, శాస్త్రజ్ఞానముతో ఏకీభవించిననే ముక్తి కల్గును. అందులకే శిష్యునకు గురువునందు ఐకాంతిక భక్తియుండవలయునని భగవత్పాదులు చెప్పిరి.

అనేక జన్మల పుణ్యసంచయము వలన మానవ జన్మము కలుగును. ఈ జన్మ సాఫల్యము స్వాత్మసాక్షాత్కారము వలననే కల్గును. అందులకే మహావాక్యములు ఆత్మ, పరమాత్మల ఐక్యమునే ఘోషించుచున్నవి. అనేక జన్మలయందు కల్గిన అజ్ఞానమును నశింపజేయును కనుక మహావాక్యములనిరి. అన్ని శాస్త్రములలోను ప్రపంచము అనిత్యమనే చెప్పబడినది. అనేక జన్మలనుంచి వచ్చు అజ్ఞానము వలన మానవుడు మరల మరల జన్మించుచున్నాడు. కనుకనే భవము అనగాసంసారము. దీనినే భగవత్పాదులు దీర్ఘరోగమనిరి. రోగముతో యుండుటయా లేక రోగనివారణకు ప్రయత్నించుటా అనునది వారి వారి ఇష్టం. ఈ భవరోగమునకు ఔషధము విచారము. దీనినే చింతన లేక మననము లేక తపస్సు అందురు. సృష్టికర్త బ్రహ్మ సృష్టి ఆదిలో అంతటా జలమయముగా చూచి భయపడెను. అంతట అతనికి తప అని మూడుసార్లు ఆకాశవాణి ద్వారా వినబడెను. ఆయన దీర్ఘమననము గావించి పూర్వమున్నట్లే మరల సృష్టిని గావించెను. తపస్సు అనెడి జ్ఞానాగ్ని ద్వారా భవసాగరము ఎండిపోవును. ఈ విచారము నిత్యా నిత్య వస్తువివేకము వలన, విషయ వైరాగ్యమువలన, గురుకృపవలన, దైవకృపవలన కల్గును. దైవము

ఎక్కడో ఆకాశములో లేడు, అందరిలోనూ ఉన్నాడు : మనలో వున్నాడు ; వానిని విచారము ద్వారా, మననము ద్వారా అనుభవించుటయే జ్ఞానము లేక సాక్షాత్కారము. దీనినే భగవత్పాదులు భవరోగమునకు ఔషధము అనిరి.

8) శ్లో॥కిం భూషణాత్ భూషణమస్తి శీలం
తీర్థం పరం కిం స్వమనో విశుద్ధమ్ ।
కిమత్ర హేయం కనకం చ కాంతా
శ్రావ్యం సదా కిం గురువేదవాక్యమ్ ॥

1. ప్ర॥ అలంకారములలో ఉత్తమమైన అలంకారమేది ?
జ॥ ఉత్తమ చరిత్ర అనగా శీలమే అలంకారము.

2. ప్ర॥ అన్నింటికన్న ఉన్నతమైన తీర్థస్థలమేది ?
జ॥ పరిశుద్ధమైన మన మనస్సే ఉత్తమ తీర్థస్థలము.

3. ప్ర॥ సంసారములో పదిలిపెట్ట వలసినవి ఏవి ?
జ॥ కామినీ, కాంచనములే సంసారములో పదిలి వేయవలసినవి.

4. ప్ర॥ ఎల్లప్పుడూ మనస్సుతో దేనిని వినవలయును ?
జ॥ వినవలసినవి గురువేద వాక్యములే.

వివరణ : ధనము నష్టమైన తిరిగి సంపాదించు కొనవచ్చును. ఆరోగ్యం చెడినను మరల పుంజుకొనవచ్చును. కాని చరిత్ర నష్టమైన సర్వమూ నాశనమైనట్లే !

గీతలో కామ, క్రోధముల వలననే ప్రణశ్యతి అని చెప్పిరి, అనగా ప్రకర్షేణ నశ్యతి దీనికి అర్థము పూర్తిగా నశించును అని.

శీలము చెడిన వేరుగా చెప్పవసరము లేదు, వారికి పరలోక ద్వారం పూర్తిగా మూసివేయబడినది.

ఇతి హాసములో సీతాదేవిని మించిన శీలవతి లేదు ; రాముని మించిన ధర్మాత్ముడు లేడు, అందులకే యుగములు దాటినను వారి నామములు శ్రద్ధతో కీర్తించుచున్నారు. శీల నిర్మాణము చేయు విద్యాభ్యాసము ఈ కాలములో చాలా ఆవశ్యకము, స్వధర్మాచరణ లేనిదే శీలనిర్మాణమునందు పటిష్ఠత లేదు. కనుకనే చరిత్ర రక్షణకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించవలెను. అందులకే యిచ్చట అలం కారములలో ఉత్తమ అలంకారము శీల మని చెప్పిరి.

తీర్థయాత్ర ముఖ్యముగా ఆధ్యాత్మికోన్నతికై చేయు చుండెడివారు. ఆ తీర్థములలో జరిగిన పురాణఘట్టములను మననం చేయుచూ తిరిగి వచ్చిన తరువాత కూడా అక్కడి విశేష దర్శనములను మననము చేయుచూ మనస్సు శుద్ధిచేసికొనుటకు తీర్థయాత్రలు గావించుచుండెడివారు. ఆ విధముగా తీర్థయాత్రలు చేయుట ఈ కాలములో ఎవరికి సంభవమో వారి యాత్ర సఫలమగును. మనస్సునందు అనేకజన్మల మలినవాసనలు గలవు. శాస్త్రచింతన, దైవ చింతన, ఉపాసనవలన ఈ మనస్సు మెల్లమెల్లగా శుద్ధమగును. నిర్మలమైన మనస్సు నందు వివేక, వైరాగ్యములు వృద్ధి పొందును. ఆ తరువాత శాస్త్రచింతనవలన అనేక జన్మల నుండి వచ్చు అజ్ఞానము నశించి ఆత్మజ్ఞాని యగును. జ్ఞానమునకు మూల కారణము విశుద్ధమైన మనస్సు, దానికై మొదట అసూయా రాగద్వేషములు పదిలి వేసి నిష్కామత్వముగా ప్రవర్తించవలెను. నిష్కపటత కూడా అనేక జన్మల తపస్సు వలన కల్గును. మనో నిర్మలత్వం ద్వారా సహజావస్థను పొందుట ముఖ్యోద్దేశ్యము. అందులకే –

ఉత్తమా సహజావస్థా మధ్యమా ధ్యానధారణా ।
శాస్త్ర చింతాధమా ప్రోక్తా తీర్థయాత్రాధమాధమా ॥

స్వస్వరూపమునందు నిష్ఠ ఉండుట ప్రథమావస్థ ; ధ్యాన ధారణలు రెండవ అవస్థ ; శాస్త్ర చింతన అథమావస్థ; తీర్థయాత్ర అధమాధమావస్థ.

అందులకే ఇచ్చట భగవత్పాదులు విశుద్ధమైన లేక నిర్మలమైన తనయొక్క మనస్సు ఉత్తమ తీర్థస్థానమని చెప్పిరి. మలిన మనస్సుతో తీర్థయాత్ర చేయుటచే ఫలశూన్యమగునని యిచట సూచితమగుచున్నది.

ఆధ్యాత్మిక సాధనాపరునికి కామినీ – కాంచనములు ప్రతి బంధకములు. కాంతాలోలుని మనస్సు నాటి నాటికి బహిర్ముఖ మగును గాని అంతర్ముఖం కాదు. యయాతి మహారాజుకు అనేక సంవత్సరములు పుత్రుని యౌవనము తీసికొని కామభోగములను భవించినను సంతృప్తి కలుగలేదు.

శ్లో॥ న జాతు కామః కామానాం ఉపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభి వర్ధతే ॥ (శ్రీమద్భాగవతం **2-19-14**)

కామ భోగములనుభవించుట వలన తగ్గవు, తృప్తి కలుగదు. అగ్నిలో నెయ్యిపోసిన మంటలు పెరుగునట్లు భోగములను భవించుటవలన ఆకాంక్ష పెరుగునే కాని తరుగదు. ఈ ఆకాంక్షను చంపుటకు ఒకటేత్రోవ గలదు. మనస్సు కాంతల నుండి మరల్చి కామారిపై (శివునిపై) నిలుపుటే మార్గము. తూర్పు దిక్కునకు పోవుచున్న కొలది పడమర దూరమగును. అట్లే భగవంతుని మనన, చింతనలు పెరిగిన కొలది కామ, క్రోధాదులు తగ్గును.

అర్థ మనర్థం భావయ నిత్యం అని శంకరులు భజగోవిందంలో చెప్పిరి. ధనము అనర్థములకు హేతువు. ధనాశ తల్లిని, తండ్రిని, గురువును బంధువులను లెక్క చేయనీయక వారి ప్రాణములు తీయువరకు (ధనాశ) తీసికొనిపోవును. కప్ప కు రూపాయి బిళ్ళ దొరికిన అది ఏనుగునకు కాలు చూపించునట అని రామకృష్ణ పరమహంస చెప్పెడివారు. ధనమదాంధము ఈ విధముగా నుండును. నీతికారులు అర్థాతురాణాం నగురుర్, న బంధుః అనిరి. సక్రమముగా మంచి మార్గములో సంపాదించుచు, అత్యంత ఆవశ్యకములైన అవసరములను తీర్చుకొనుచు, మిగిలిన ధనము దానధర్మాదులకు, యజ్ఞయాగాదులకు ఖర్చు పెట్టవలెను. అపుడే విత్తము దైవ విత్తమగును; లేనిచో యిచ్చటనే నష్టమగును. కావుననే శంకరులు కామినీ, కాంచనములు త్యాజ్యమని తెల్పిరి.

గురు, వేదవాక్యములు సదా వినవలెను. పరమాత్మ లేక బ్రహ్మ నిరాకార, నిర్గుణము. ఇంద్రియములు, మనస్సు దానిని అనగా బ్రహ్మను గ్రహించలేవు. నిదురలోనున్న వ్యక్తికి మనస్సు, ఇంద్రియములు పనిచేయవు. గాఢ నిద్ర లేని వ్యక్తిని లేపుటకు శబ్దమును ప్రయోగించనవసరము లేదు కాని, గాఢ నిద్రలో వున్న వ్యక్తిని లేపుటకు శబ్దమును ప్రయోగించెదరు. ఆ శబ్దమే తమస్సులో మునిగి యున్న వానిని జాగ్రదవస్థకు మేల్కొలుపు చున్నది. అట్లే సంసార రూపమైన అజ్ఞానాంధకారములో మునిగియున్న వ్యక్తిని గురువేదవాక్యములు మేల్కొలిపి జ్ఞానావస్థను కలుగజేయుచున్నవి. అందులకే భాగవతములో యిట్లు చెప్పిరి –

విష్ణు కీర్తనములు వినని కర్ణంబులు కొండలబిలములు కువలయేశ ! శబ్దమునందు అపరిమితమగు శక్తి కలదు. త్రోవలో పోవుచున్న ఎరుకలేని వ్యక్తిని కారణరహితముగా తిట్టిన అతడు చేయిచాచి చెంపకాయ కొట్టగలడు. వాని చల్లని నెత్తురను వేడిగా మార్చినది ఈ శబ్దమే కదా ! సాధారణ లౌకికశబ్దములందు ఇంత శక్తి గలిగిన, గురు, వేద వాక్యములందు ఎంత శక్తి కలదో మీరే ఊహించగలరు. అందులకే శంకరులు గురు వేదవాక్యములను వినవలయుననిరి.

9) శ్లో॥కే హేతవో బ్రహ్మగతేస్తు సంతి
సత్సంగతిర్దానవిచారతోషాః ।
కే సంతి సంతోఽఖిలవీతరాగా
అపాస్తమోహాః శివతత్త్వనిష్ఠాః ॥

1. ప్ర॥ పరమాత్మను పొందుటకు సాధనలేవి ?

జ॥ సత్సాంగత్యము, సాత్త్వికదానము, పరమేశ్వరుని యొక్క స్వరూపమును మననము గావించుట మరియు సంతోషము.

2. ప్ర॥ సత్పురుషులెవరు ?

జ॥ సంపూర్ణ సంసార విషయములపై ఆసక్తి లేనివాడు, అజ్ఞానము నశించినవాడు, ఎల్లప్పుడూ పరమాత్మ తత్త్వము నందే నిష్ఠగలవాడు.

వివరణ : సాధుపుల సాంగత్యములో పూర్వ జన్మమున దాసీపుత్రుడైన నారదుడు దేవఋషి అయ్యెను. హిరణ్యకశిపుడు అతని భార్య కయాధులకు కలిగిన రాక్షస సంతానము నారదుని నారదుని సత్సంగము వలన హరిభక్తుడైన ప్రహ్లాదునిగా

మారెను.మంత్రోపదేశము వలన, కొద్ది క్షణముల సాంగత్యము వలనను రాజకుమారుడైన ధ్రువుడు ధ్రువతారగా మారెను. శంకరుని భార్య అయిన సతీదేవి మరునటి జన్మలో పార్వతిగా జన్మించి నారదుని మంత్రోపదేశము వలన అబద్ధము ద్వారా కలిగిన పాపమును తొలగించుకొని మరల శివుని అర్ధాంగి అయినది. ఈ మధ్యకాలములో అన్ని రకముల పాపములు చేసిన గిరీష్ చంద్రఘోష్ అను బెంగాలీ భక్తుడు రామకృష్ణ పరమహంస సాంగత్యమువలన పరమభక్తుడయ్యెను. మహాత్ములు సాధనచేసి అనుభవము ద్వారా సాధకులయొక్క మార్గమును నిర్దేశించెదరు. అంతేగాక తపస్సు ద్వారా పొందిన శక్తిని ఆశీర్వాదముల ద్వారా ప్రవేశింప జేయుదురు. రాక్షసి అయిన లంకిణికి కూడా కొద్ది క్షణముల హనుమంతుని సాంగత్యము వలన బ్రహ్మయొక్క భవిష్యవాణి గుర్తుకొచ్చినది. భజగోవిందంలో శంకరులు చెప్పినట్లు సత్సంగము ద్వారా జీవన్ముక్తి కలుగును. కనుకనే యిచ్చట జ్ఞానమునకు సత్సంగము ఆవశ్యకమనిరి. ఈ సత్ సాంగత్యము వలననే గరుత్మంతునికి కలిగిన మోహమును కాకభుశుండి తొలగించెను.

ధనమునకు మూడుగతులు. అవి ఏవనగా, దానము భోగము, లేక నాశనము. అన్ని దానముల కన్న జ్ఞానదానము గొప్పది. అన్నము ద్వారా కొద్ది గంటలు తృప్తి పరచగలము. విద్య ద్వారా ఒక జీవితమును బాగుచేయవచ్చును, కాని జ్ఞానము ద్వారా జన్మ మృత్యువుల సంసారమునుండి దాటగలము. అందరు జ్ఞాన దానము చేయలేరుగనుక అన్నదానము, సుపాత్రునికి ధనదానము చేయవలయును. మనము తిన్న ఆహారము, మనకై ఖర్చుపెట్టిన ధనము మనతోనే నశించును ; గాని యజ్ఞయాగాదులకు సత్కర్మలకు సుపాత్రులకు యిచ్చిన ధనము దైవవిత్తమై మనకు ఈ జన్మము తరువాత కూడా తోడ్పడును. ఉపనిషత్తులలో మనుష్యునకు బ్రహ్మ యిచ్చిన ఉపదేశము దత్త అని ; అనగా దాచుకొనుటకు బదులు దానము ద్వారా శుద్ధిచేసికొనవలెనని సూచించెను. మానవుని యందలి ముఖ్యదోషము – ప్రతీదీ కూడబెట్టుట – కావున పై ప్రకారము ఉపదేశించిరి. నీతి కోవిదుల దాన – విచారము గురించి

ఈ శ్లోకములో వివరంగా చెప్పబడినది.

అదాన దోషేణ దరిద్రోభవా
దారిద్ర్య దోషేణ కరోతిపాపమ్ ।
పాపాదవశ్యం నరకం ప్రయాతి ।
పునర్ దరిద్రం పునరేపభవతి ।

సంతోషము : ఉన్నదానితో తృప్తిచెందవలెను. సన్మార్గము ద్వారా వచ్చిన ఆదాయముతో సంతృప్తి చెందవలెను. లేనిచో పాపకర్మలు చేయుదురు. ఇట్లు ధనాశకై పాపమాచరించువారిని ప్రతిచోట చూచుచునే యున్నాము. దాయాదుల ఆస్తికై ఆశపడిన దుర్యోధనుని వంశము సమూలంగా నశించినది. అందులకే సంతోషము సగము బలము అని సామెత. సత్సంగము, దానము, విచారము, సంతోషము ఈ నాలుగు ముక్తి మార్గములని భగవత్పాదులు తెల్పిరి.

విషయవిరక్తి అజ్ఞాననాశనము. పరమాత్మ నిష్ఠగలవారిని సత్పురుషులనిరి. లోమశమహర్షి దీనికి పురాణములలో ఉదాహరణము. ఇంద్రుడు ఒకసారి మంచి భవనము నిర్మాణము చేయించుచుండెను. ఎంతకాలమైనా అది పూర్తికాకుండెను. ముఖ్యశిల్పి సెలవుదొరకక చాలా యిబ్బందిపడు చుండెను. అపుడు నెత్తిమీద ఒకచాప, చంకలో ఒక చాప పట్టుకొని లోమశ మహర్షి యింద్రునికి దర్శనమిచ్చెను. ఇంద్రుడు అడుగగా మహర్షి చెప్పిరి. యుగయుగములందు కురుక్షేత్ర యుద్ధము జరిగి బంధువులందరు చనిపోవుచుందురు. వారికి ఒక్కొక్క యుగములో ఒక వెంట్రుక తీసి శ్రాద్ధరూపములో పారవేయుదురు. అందులకే ఛాతీమీద కొన్ని వెంట్రుకలు లేవు. ఈ జగత్తు అనిత్యము గనుక ఇల్లు, వాకిలి లేకుండ ఎండవేడిమి తట్టుకొనుటకు ఒక చాపనెత్తిపైన, పరుండుటకు వేటొక చాప చంకలోను వున్నది !! వీరిలో నున్న సత్పురుష లక్షణములను చూచి ఇంద్రుడు సిగ్గుపడి కట్టడమునకు స్వస్తిచెప్పెను. ఇది కేవలము దృష్టాన్తము. వాస్తవముగా పుత్రైషణ, లోకైషణ, విత్తైషణలను త్యజించి శరీరము పై మోహమును విడిచి ఎల్లప్పుడూ పరమాత్మచింత చేయువారే సత్పురుషులు.

బహూనాం జన్మనా మంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే ! అని **7–19** గీతలో ఉపదేశము, అనేక జన్మలలో చేసిన తపస్సువలన సాధకునిలోని అజ్ఞానము నశించి అతడు ఈశ్వరప్రాప్తిని పొందును. అట్టి సత్పురుషులు యిద్దరో, ముగ్గురో యుందురని

వేదములలో చెప్పిరి. యమేవైష వృణుతే తేన లభ్య అనగా మనస్ఫూర్తిగా ఆపరమాత్మను ఎవరు వాంఛింతురో వారిపైన ఆయనదయగల్గి వానిని పొందుదురు. అందులకే –

ఈశ్వరానుగ్రహాదేవ పుంసా మద్వైత వాసనా ।

మహాభయపరిత్రాణా ద్విత్రాణాముపజాయతే (అవధూత గీత 1-1)

ఈశ్వరుని అనుగ్రహమువలననే పురుషునిలో అద్వైత వాసన జనించును. ఈజ్ఞానము కేవలము ఇద్దరు, ముగ్గురకే లభించును. లభించినవారే సంసారభయము నుండి ముక్తినొందుదురు. సాధారణ సాధకులు వైరాగ్యమును పెంపొందించుకొనుచు ఎల్లప్పుడూ స్వాత్మానుసంధానము చేయుచున్న మోహము నశించి సత్పురుషుల కోవలోనికి చేరగలరు. మనస్సునందు ఏ మాత్రము ఇచ్ఛలున్నా వారు వైరాగ్యవంతులు కాలేరు, మరియు అజ్ఞానము వారి యందు నశించినదని చెప్పట కూడా కష్టమే.

కనుకనే భగవత్పాదులు అఖిలవీతరాగులు, అజ్ఞానము నశించినవారు, శివతత్త్వ నిష్ఠులైనవారు సత్పురుషులనిరి.

10) శ్లో॥కో వా జ్వరః ప్రాణభృతాం హి చింతా
మూర్ఖోఽస్తి కో యస్తు వివేకహీనః ।
కార్యా ప్రియా కా శివవిష్ణుభక్తిః ।
కిం జీవనం దోషవిపర్జితం యత్ ॥

1. ప్ర॥ ప్రాణులకు వాస్తవానికి జ్వరమేది ?

జ॥ చింతయే జ్వరము.

2. ప్ర॥ మూర్ఖుడెవరు ?

జ॥ విచారహీనుడే మూర్ఖుడు.

3. ప్ర॥ ప్రేమతో చేయవలసిన కార్యమేది ?

జ॥ శివ, విష్ణువుల భక్తి.

4. ప్ర॥ వాస్తవమునకు జీవనమేది ?

జ॥ ఎల్లప్పుడూ కళంకరహితమైనదే జీవితము.

వివరణ : చింత జీవించియున్న మనిషిని కాల్చివేయును, చితి చనిపోయిన వానిని మాత్రమే కాల్చును. కావున చింతయే జ్వరమనిరి. ఈ చింతకు కారణములు దేహాభిమానము, మమత, ఆశ, లోభము, రాగ ద్వేషాదులు.

చింతయా జాయతే దుఃఖం నాన్యథేహేతి నిశ్చయా ।

తయా హీనః సుఖీ శాంతః సర్వత్ర గలిత స్పృహః ॥

చింతవలననే దుఃఖమని తెలుసుకొన్న వారిదే నిశ్చయ జ్ఞానము. సర్వత్ర కోరికలు లేనివారే సుఖశాంతులతో తులతూగుచూ చింతాముక్తులై యుందురు. ఇది అష్టావక్ర సంహితలో **11** వ అధ్యాయంలో **5** వ శ్లోకం.

విచారహీనులను, వివేకహీనులను మూర్ఖులనినారు. వివేకం లేనివాడు ప్రపంచమే నిత్యము అని తలంచి విషయవస్తువుల భోగమందు లిప్తుడై సంసార సాగరములో తిరుగాడు చుండును. వివేకం లేని మనిషి పశువుతో సమానము.

జాగర్తి కోవా సదసద్వివేకీ అన్నచోట చెప్పినాము గనుక విచారము గురించి యింక చెప్పనవసరము లేదని తోచుచున్నది. కనుకనే వివేక హీనుడే మూర్ఖుడు.

శ్యతిపాపం ఇతి శివః – పాపమును నాశనము చేయువాడే శివుడు.

విశ్వవ్యాపీ ఇతి విష్ణుః – అనగా సర్వత్ర వ్యాపించియున్నవాడే విష్ణువు.

ఆత్మలేక ఆత్మజ్ఞానమే పూర్తిగా పాపమును నాశనము చేయును ; అదే శివస్వరూపము, సర్వత్ర వ్యాపకమైయున్నదే ఆత్మ; అదే విష్ణు స్వరూపము; కనుక శివ, విష్ణువులలో భేదము లేదు. దీనినే సూచించును రామేశ్వర పదము. రాముని అడుగగా రామస్య ఈశ్వరః – రామేశ్వరః – అనగా రాముని ఆరాధ్యదైవము శివుడు అనిరి. శివుని అడుగగా రామో ఈశ్వరః యస్య – రామేశ్వరః – అనగా ఈశ్వరునికి ఎవరైతే ఆరాధ్యదైవమో అతడే రామేశ్వరుడు అనిరి. రాముడు శివుని, శివుడు

రాముని జపించెదరు. అందులకే ఆత్మజ్ఞానము గల పండితులు రామశ్చ అసౌ ఈశ్వరశ్చ అని శివరాములకు అభేదము చెప్పిరి. వీరిపై భక్తిచేయవలయునని ఇచ్చట అనిరి. భజసేవాయాం అనుధాతువు నుండి భక్తి శబ్దము వచ్చినది. ఆత్మ, పరమాత్మ, ఈశ్వరుడు మొదలైన వారినే సేవించవలెను ; దారా, పుత్ర, బంధువులను కాదు, ఆత్మ సేవయనగా సర్వత్ర ఆ పరమాత్మ ఉనికి చూచుచు, అన్ని జీవజంతువులలో ఆ పరమాత్మనే చూచుచు, అందరికీ సమముగా సేవ చేయవలయును. ఇతరులు, నావారు అను భేదము వదిలి సేవ చేయుటయే ఆత్మ సేవయగును. దీనినే ధర్మమందురు. అందులకే యిచట భగవత్పాదులు ఎల్లప్పుడూ చేయవలసినది శివ, విష్ణువుల భక్తి యనిరి.

నిర్దోషమైన జీవనమే జీవనము తెలివి, వివేకము కలిగిన తర్వాత దోషములను వదలివేయ వలయును. మానవమాత్రులమై నందువలన మనయొక్క వర్ణాశ్రమ ధర్మములను తెలిసికొని ధర్మమార్గమున ప్రవర్తించుట మన కర్తవ్యము. తెల్లని బట్టలపై మచ్చపడిన అందరికీ స్పష్టముగా కనిపించును. ధర్మరాజు అసత్యము పలుకక పోయినను ఆయన భావము విపరీతముగా నుండుట వలన ద్రోణాచార్యులను చంపిన దోషము కలిగి, తిన్నగా స్వర్గమునకు పోలేక నరకదర్శనానంతరమే పోయెను. ధర్మ, కర్మములు అతి సూక్ష్మములు కనుకనే అప్రమత్తంగా వుండి నిర్దోష జీవనము గడుపుటకు ప్రయత్నించవలెను. మా శారదాదేవి పూర్ణిమనాటి చంద్రుని చూచుచు ఈ విధముగా ప్రార్థించెడిది.

పరమాత్మా ! ఈ చంద్రునిలో కూడా మచ్చలున్నవి; కాని నా జీవితములో దోషములనెడి మచ్చలు లేకుండా చేయుమని ప్రార్థించెడిది. అందుకే యిచట భగవత్పాదులు దోషములేని జీవనమే జీవితమనిరి.

11) శ్లో॥విద్యా హి కా బ్రహ్మగతిప్రదా యా
బోధో హి కో యస్తు విముక్తి హేతుః ।
కో లాభ ఆత్మాపగమో హి యో వై
జితం జగత్కేన మనో హి యేన ॥

1. ప్ర॥ అనలైన విద్య ఏది ?
జ॥ పరమాత్మను పొందింప జేయు విద్యయే విద్య.

2. ప్ర॥ వాస్తవమైన జ్ఞానమేది ?
జ॥ యథార్థముగా ముక్తికి కారణమైనదే వాస్తవ జ్ఞానము.

3. ప్ర॥ అనలైన లాభమేది ?
జ॥ పరమాత్మ ప్రాప్తియే.

4. ప్ర॥ జగత్తును జయించినవాడు ఎవడు ?
జ॥ మనస్సును జయించినవాడే జగద్విజేత.

వివరణ : ఆధ్యాత్మ విద్యా విద్యానాం మహాత్ములు చెప్పినదేమనగా ప్రపంచమంతను జయించిననూ తన్నుతాను తెలుసుకోలేకపోయిన, పరాజితుడే ! ప్రపంచజయముపలన లాభము లేదు. విజ్ఞానము మనస్సును బహిర్ముఖము గావించును. ఆధ్యాత్మిక విద్య మనస్సును అంతర్ముఖము గావించును. అందులకే స్వామి వివేకానందులు – భౌతిక విజ్ఞానము ఎచట అంతమగునో అక్కడనే ఆధ్యాత్మిక విద్య మొదలగుననిరి. వివేకము లేని జంతువువలె జీవించుట కన్న ఆధ్యాత్మిక సాధన చేయుచు మానవుని వలె జీవించుట మంచిది గదా ! మనుషులు నాలుగు తెగలు. మొదటి వారు నారదుడు, శుకదేవుడు వంటి నిత్యసిద్ధులు, రెండవ తెగవారు ముముక్షువులు. పుత్రైషణ, విత్తైషణ, లోకైషణ వదలి జ్ఞానమునకై శ్రవణ, మనన, నిదిధ్యాసపరులు. మూడవ తెగవారు మహాత్ములు లేక ధర్మాత్ములు. వీరు గృహస్థ జీవనములోనే వుండి, సన్మార్గమున ప్రవర్తించుచూ, వేదోక్త ధర్మములను, స్మృతుల ధర్మములను పాటించువారు. నాల్గవ తెగవారు పామరులు ; వారికై పురాణములు చెప్పబడినవి ; పౌరాణిక మార్గము నవలంబించువారు. ఇక, దైవమును విశ్వసింపక, నాస్తిక వాదములు, హేతువాదములు చేయువారు ఈ జన్మలో మనుష్యులై ననూ, మరునటి జన్మనందు నక్కలుగా జన్మింతురని శ్రీరాముని శాపము ; కనుకనే భగవత్పాదులు పరమాత్మప్రాప్తికి తోడ్పడు విద్యయే విద్య మరియు ముక్తినిచ్చు జ్ఞానమే జ్ఞానము అనిరి. యదార్థ లాభము పరమాత్మ ప్రాప్తియే అనిరి. ప్రపంచములో అనేక రకముల లాభములున్నను పరమాత్మ ప్రాప్తియే

యదార్థలాభము అనుట విశేషంగా తైత్తరీయ ఉపనిషత్ – బ్రహ్మానందవల్లితో చెప్పబడినది. ఆ ఆనందవల్లి సారాంశము దిగువ కొంత చెప్పుటకు ప్రయత్నించె దను.

దృఢకాయుడు, వేదవేదాంగముల పండితుడు, యౌవనము గలవాడు, మరియు శాస్త్రములో చెప్పు జీవనము గడుపువానికి, మొత్తము ప్రపంచ రాజ్యమునకు రాజైన వానికి, అన్ని సౌకర్యములు సులభముగా నున్నవానికి, ఒక మనుష్యుని ఆనందము కలుగుచున్నది. దీనికి **100** రెట్లు ఆనందము మనుష్య గంధర్వ దేవగంధర్వ కర్మదేవతలకు – కర్మదేవతలకు **100** రెట్లు పితృచిరలోక లోక ఆజాన జానదేవతలకు – దానికి **100** రెట్లు ఇంద్రునికి, ఇంద్రుని ఆనందము కంటె **100** రెట్లు గురువైన బృహస్పతికి – బృహస్పతికి **100** రెట్లు ఆనందం బ్రహ్మగారికి కలుగును. శ్రోత్రియుడు, పాపరహితుడు, కామనా రహితుడైన జీవన్ముక్తిని ఆనందములో ఈ బ్రహ్మయొక్క ఆనందం యిమిడి యున్నది. అందరు సుఖమునే కోరుదురు. ఆత్యంతిక సుఖము ఆత్మానందము నందే కలదు. అందువలననే యిచట భగవత్పాదులు పరమాత్మ ప్రాప్తియే యథార్థలాభమని తెలిపిరి.

మనస్సును జయించినవాడే జగత్తును జయించువాడనిరి. గురువుగారైన వశిష్ఠుల వారితో శిష్యుడైన రాముడు చెప్పినదేమనగా ప్రపంచములోని ఏ కార్యమునైనా చేయగలను, గాని మనస్సును జయింపలేకున్నాను అనెను. అర్జునుడు కూడా కృష్ణునితో గాలిని గుప్పెడిలో బంధించుటవలె మనస్సును జయించుట కష్టమనెను. సరిగ్గా చెప్పాలంటే మనస్సు అవంచీకృత, పంచభూతములతో చేయబడిన పదార్థము ; సర్వవ్యాపకమైన ఆత్మయొక్క స్ఫురణచే, పూర్వపు సంస్కారముల వలను, మనస్సు పరిపరివిధముల పోవుచున్నది. వివేకపంతుడు – తనయొక్క స్వరూపమైన ఆత్మ యందు చలనము లేదనియు, చలనముగల మనస్సు, ఇంద్రియములు తన స్వరూపముగాదని తెలుసుకొని, నిశ్చలభక్తితో ఆత్మానుసంధానము చేయుచుండును. దీనినే గీతయందు అభ్యాస, వైరాగ్యముల ద్వారా మనస్సును జయింప వచ్చునని తెలిపిరి. అవివేకులకు భగవదనుగ్రహము కలిగినా, పశుపుత్ర దారాధనము వలన దెబ్బలు తగిలినా వైరాగ్యము కలుగును. బురదలోని పందికి బురదయే ఆనందము. అట్లే అవివేకులకు ప్రాపంచిక విషయములే రుచించును గాని భగవద్విషయములు కావు. మనస్సును జయింపనంతవరకు సుఖము లేదు. కనుకనే మనస్సును జయించిన వారే జగత్తును జయించిన వారనికి శ్రీ భగవత్పాదులు.

12) శ్లో॥శూరాస్మహాశూరతమోఽసి కో వా
మనోజబాణైర్వ్యథితో న యస్తు ।
ప్రాజ్ఞోఽథ ధీరశ్చ సమస్తు కో వా
ప్రాప్తో న మోహం లలనాకటాక్షైః ॥

1. ప్ర॥ వీరులలో మహావీరుడెవ్వడు ?

జ॥ కామబాణముల ద్వారా పీడితుడు కానివాడే వీరుడు.

2. ప్ర॥ బుద్ధిమంతుడు, సమదర్శి మరియు ధీరపురుషుడెవ్వడు ?

జ॥ స్త్రీల కటాక్ష దృష్టిద్వారా మోహము కలుగని వాడే బుద్ధిమంతుడు.

వివరణ : పై సమాధానముల వివరణ **3, 6, 8** శ్లోకములలో యీయబడినది. అచట నరకద్వారము నారి అనియు, మద్యమువలెనే మోహింప చేయునది స్త్రీ అనియు, కామినీ కాంచనములు త్యాజ్యములని చెప్పబడినది. వానినే యిచట శబ్దాంతరములలో కామబాణములతో పీడింపబడని వాడు స్త్రీల కటాక్ష దృష్టివలన మోహము చెందనివాడు మహావీరుడు, ధీరుడు, బుద్ధిమంతుడు, సమదర్శి అని శంకరులు అనిరి. శాస్త్రములో దీనిని అభ్యాసము అందురు. అనగా చెప్పిన విషయము మరల మరల చెప్పుట, సాధకులకు అన్నిటికన్న కష్టమైనది మరియు తేలికగా దాటలేని ప్రతిబంధము యీ కామమే. అందులకే హృదయమునకు హత్తుకొని వైరాగ్యము పెంపొందించుకొనుటకు మరల మరల చెప్పిరి.

13) శ్లో॥విషాద్విషం కిం విషయాः సమస్తా
దుఃఖీ సదా కో విషయానురాగీ ।
ధన్యోఽస్తి కో యస్తు పరోపకారీ
కः పూజనీయः శివతత్త్వనిష్ఠः ॥

1. ప్ర॥ విషము కంటె విషమేది ?

జ॥ విషయభోగమే విషము కంటె విషము

2. ప్ర॥ ఎల్లప్పుడూ దుఃఖించు వాడెవడు ?

జ॥ సంసార భోగములందు ఆసక్తి గలవాడు.

3. ప్ర॥ ధన్యుడెవడు ?

జ॥ పరోపకారి ధన్యుడు.

4. ప్ర॥ పూజనీయుడెవడు ?

జ॥ పరమాత్మ తత్త్వమునందు స్థిరనిష్ఠ కల మహాత్ముడు.

వివరణ : శ్లో॥ ముక్తి మిచ్ఛసి చేత్తాత విషయాన్ విషవత్త్యజ ।

క్షమార్జవదయాతోష సత్యం పీయూష వద్భజ ॥ (అష్టావక్ర సంహిత **1-2**)

ముక్తినికోరు వారు విషయములను విషమువలె వదిలివేయ వలయును. క్షమ, సరళత, దయ, సంతోషములను అమృ తతుల్య ముగా భావించి, ఆచరించవలెను. విషయములు మనస్సును బహిర్ముఖము గావించును. అందులకే యింద్రియములకన్న విషయములు బలవంతమైనవి. ఎందులకనగా యత్నశీలుడైన సాధకుని మనస్సు కూడా యీ ఇంద్రియములే బహిర్ముఖము గావించును. వాయుర్నావ మివాంభసి గాలి పడవను ప్రక్కకు నెట్టివేయునట్లు సాధకుని విషయాసక్తి మార్గము నుండి పతనము గావించును. అన్ని శాస్త్రములలోను - శబ్ద, స్పర్శ, రూప, రస గంధములతో కూడిన విషయములను వదిలివేసి, ఇంద్రియములను అంతర్ముఖము గావించవలెననిరి. శంకరులు మనసశ్చ ఇంద్రియాణాం ఐకాగ్ర్యం తపః । మనస్సు, ఇంద్రియముల ఏకాగ్రతనేభగవత్పాదులు తపస్సనిరి. ఏకాగ్రతలేని మనస్సు సాధకుని గమ్యము చేర్చదు. అదుపులో లేని గుఱ్ఱములు రథమును త్రోవపక్కలోనున్న గొయ్యిలో పడవేయును. అట్లుగాక అదుపులో వున్న గుఱ్ఱములు రథమును, రథములో కూర్చున్న యజమానిని గమ్యమునకు చేర్చును. ఇచట గుఱ్ఱములే యింద్రియములతో పోల్చబడినవి. అందులకే సాధకులు విషయముల నుండి యింద్రియములను మరల్చి సాధనలో కేంద్రీకరించవలెను. విషయములే విషముకన్న విషమునిరి.

విషయానురాగమే ఎల్లప్పుడు దుఃఖమునకు కారణము, ఇంద్రియముల తేజస్సును హరింపజేయును - జరయింతి తేజః ఒక కాకికి మాంసపు ముక్క దొరికిన దానిని తినుటకై మిగిలిన కాకులు దానిని చేరి పొడుచు చుండును. అప్పుడది ఆ మాంసపు ముక్కను జారవిడచి ఏకాంతముగా పోయి శాంతచిత్తముతో చెట్టుపై కూర్చుండును. అట్లే విషయములకై అందరూ ఎగబడుచూ, ఒకరితో ఒకరు దెబ్బలాడుచూ, నేనుముందు నేనుముందు అని పోటీ పడుచుందురు. విషయములను వదలిపెట్టినవారు మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థించుచు శాంతిని పొందెదరు. అందులకే ఇచట భగవత్పాదులు విషయములపై అనురాగము కలవారు ఎల్లప్పుడూ దుఃఖమునే అనుభవింతురనిరి.

ధన్యులెవరని అడుగగా పరోపకారము చేయువారే ధన్యులనిరి. వ్యాసులవారు ఇదియే ధర్మసారమని చెప్పిరి.

పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్.

ఇతరులకు ఉపకారము చేసిన పుణ్యరూపమైన ధర్మము పెరుగును. అపకారము చేసిన పాపము పెరుగును. పరోపకరాము చేసినవారి చుట్టూ జనులు బెల్లము చుట్టూ చీమలు చేరినట్లు చేరుదురు. అపకారము చేయకున్ననూ, కేవలము కఠోరముగా మాట్లాడువారి దగ్గరకు కూడా జనులు చేరరు. ఉపకారము చేసియే రాముడు ధర్మాత్ముడు అనిపించుకొనెను. ఆధ్యాత్మిక జీవనములో అందరూ గంటల తరబడి ధ్యానము, యోగాభ్యాసము చేయలేరు. అందులకే కృష్ణపరమాత్మ చెప్పినట్లు, ఫలాకాంక్షను విడిచిపెట్టి యితరులకు ఉపకారము చేయుచున్న అంతఃకరణము శుద్ధిచెంది తేలికగా ఆధ్యాత్మిక ఉన్నతిని పొందును. శరీరము నశ్వరము, ధనకనకాదులు మనతోరావు. మరల జన్మనెత్తి శరీరబంధనములో పడకుండుటకై నశ్వరమైన శరీరము ద్వారా, ధనకనకాదుల ద్వారా పరోపకారము గావించి కీర్తిని గడించుట మేలు గదా ! శంకరులు అందుకే పరోపకారియే ధన్యుడనిరి.

పదవశ్లోకములో శివ, విష్ణుభక్తి గురించి చెప్పినాము. ఇచట కూడా శివతత్వ నిష్ఠయనగా ఆత్మ, పరమాత్మల ఐక్యానుభవమునకు సాధన గావించి ఏకరసరూపమైన, పరమాత్మయందు నిష్ఠగలవారు పూజనీయులు. వారినే యిచట శివతత్వనిష్ఠులనిరి. పువ్వు వికసించిన దాని వాసన పదిదిక్కులకు పెదజల్లును. అట్లే జ్ఞానియైన మహాత్ముని స్వాభావికముగనే అందరూ పూజించెదరు. అట్టివారినే గీతలో స్థిత ప్రజ్ఞులు, విద్వాంసులు, పండితులు అనిరి. విద్వాంసుని యందుగల గుణములు సాధకునికి అనుకరణీయములు. వ్యాకరణము చదువుట మొదలిడిన వారిని వైయాకరణులందురు; పూర్తిగా వ్యాకరణమును అధ్యయనము గావించి పండితులైన వారిని గూడా వైయా కరులనియే అందురు. అట్లే శుద్ధబుద్ధితో తత్వనిష్ఠకై పాటుపడువారు కూడా మహాత్ములే ! వారు కూడా పూజార్హులే ! అంతః కరణప్రవృత్తులు మంచిగానున్నవానిని మంచివాడందురు. ప్రవృత్తులు చెడ్డగానున్నవారిని చెడ్డ వారందురు. ప్రవృత్తి ప్రధానము గాని శరీర స్వరూపము ప్రధానము గాదు. అందులకే మంచి గుణములున్న వారిని, మంచి ఆలోచనలు గలవారిని, ఎల్లప్పుడూ మంచినే చేయువారిని, ఏ ఆశ్రమము నందున్నను, ఏ కులమునందున్నను మహాత్ములే అనిరి. వారిని యిచట శంకరులు పూజనీయులు, శివ తత్వనిష్ఠులనిరి.

14) శ్లో॥సరాస్వవస్థాస్వపి కిన్న కార్యం
కిం వా విధేయం విదుషా ప్రయత్నాత్ ।
స్నేహం చ పాపం పశనం చ ధర్మం
సంసారమూలం హి కిమస్తి చింతా ॥

1 ప్ర॥ అన్ని అవస్థలయందు విద్వాంసులకు చేయరానిది ఏది ? మరియు చేయవలసినది ఏది ?

జ॥ ప్రాపంచిక విషయముల యందు మమత మరియు పాపము చేయదగనివి. శాస్త్రపఠనము మరియు ధర్మపాలన చేయవలసినవి.

2 ప్ర॥ సంసారములో మునుగుటకు కారణమేది ?

జ॥ చింతయే సంసారమునకు మూలము.

వివరణ : సంసార సాగరం ఘోరం, సంసార విషయముల యందలి మమత నడి సముద్రములో ముంచివేయును. నడి సముద్రములో మునిగిన వాడు ఒడ్డుకు చేరలేడు. విషయములందలి మమత నరకమునకు ద్వారము. ఆశలు, కోరికలు, విషయవాంఛలు, ఎక్కువైన పాపాచరణము కూడా ఎక్కువగును. మనసా, వాచా, కర్మణా వేటొక ప్రాణిని నొప్పించుట కూడా పాపమే. సాధారణముగా జనులు పుణ్యము చేయరు ; కాని పాపఫలమును అనుభవించుటకు అంగీకరించరు. **84** కోట్ల జీవరాసులలోను మానవమాత్రునికి మాత్రమే బుద్ధి, వివేకము వున్నవి, వానిని ఉపయోగించుకొనుచు, సంసారమునందలి మమత, పాపాచరణము మానుకోవలెను. అందులకే యిచ్చట శంకరులు ప్రయత్నపూర్వకముగా విద్వాంసులు సంసారమునందలి మమత విడిచి, పాపాచరణము చేయరాదనిరి. అట్లే విద్వాంసులు ఎల్లప్పుడూ సత్శాస్త్రపఠనము మరియు ధర్మపాలన చేయవలయు ననిరి. ఒక్క క్షణము కూడా మనస్సు, ఇంద్రియములు కర్మచేయ కుండా ఉండలేవని గీతోక్తి. కనుక మనసుకు మంచిమేత వేయవలయును, లేనిచో సంస్కారములు చెడ్డవై అలోకములకు దారి తీయును. మనస్సుకు మంచిమేత సద్గ్రంథములు చదువుట. వేదాధ్యయనము చేసిన వివాహయోగ్య బ్రహ్మచారికి స్వాధ్యాయ ప్రవచనాభ్యాం, న ప్రమది తవ్యమ్ అనగా శాస్త్ర అధ్యయనము గృహస్థజీవనములో కూడా తప్పక చేయవలయును అని ప్రతిమనిషి ఏదో ఒక ఋషికుల సంభూతుడే. ఆ ఋషిఋణము తీర్చుటకు శాస్త్ర అధ్యయనము గురుకుల వాసములో నున్న ఉపకుర్వాణ బ్రహ్మచారి, గృహస్థుడు కూడా చేయవలెను. మంచి గ్రంథములు చదవనిచో కాలము వ్యర్థమగుటయే గాక చెడు సంస్కారములు పెంపొందించు కొని, ఆ సంస్కారములనే వేటొకరికి కూడా పంచిపెట్టుచు చక్రవడ్డీతో సహా పాపమును అనుభవించు వలసిన వారగుదురు.

ధర్మో రక్షతి రక్షితః – ధర్మము నాచరించువారిని ఆ ధర్మమే రక్షించును. ధరతి ఇతి ధర్మః – ఏది ధరించుచున్నదో అదే ధర్మము. ధర్మమును ఆచరించని వాడు పశువుతో సమానము. శాస్త్రములన్నియు వర్ణ ఆశ్రమ ధర్మములను చెప్పుచున్నవి. అవి తెలుసుకొనుట కర్తవ్యము. వాహనము నడుపువాడు త్రోవ నియమములు తెలిసినవాడై యుండవలెను. నియమమును

పాటించనిచో చెఱసాలకు వెళ్ళవలసి వచ్చును. మానవమాత్రుడై సందువలననే ధర్మములు తెలుసుకొని తీరవలెను. అందులకే యిచ్చట శంకరులు ఎల్లప్పుడూ విద్వాంసులు ప్రయత్న పూర్వకముగా ధర్మమును ఆచరించవలెననిరి.

సంసారమునకు చింతయే మూలము. కోవాజ్వరః ప్రాణభృతాం హి చింతా । అను పదవ శ్లోకములో చింతనుగురించి చెప్పుట జరిగినది. జనులు సంసారమునకై, భార్యా పుత్రాదులు బంధు వర్గమునకై, కడవల కొలది కన్నీరు కార్చుదురు. కాని, భగవంతుడే కావలెనని, వానికై ఒక్క కన్నీటి బొట్టు కూడా విడల్చరు. అంటే చింత సంసారము గురించి గాని దైవముపై లేదు. చింత అన్ని రకములుగా మనిషిని దిగదీయును. ఒకే విచారమును మరల మరల చేయుచు పోయిన మనిషికి పిచ్చి కూడా పట్టవచ్చును. ఆశ్చర్యమేమిటంటే సంసారిక చింత మనిషిని క్రుంగదీయుచున్నను; దీనికి విపరీతముగా భగవత్ చింత బుద్ధి వికాసము, శారీరక ఆరోగ్యం, శాంతిని కూడా యిచ్చును. అందులకే యిచ్చట భగవత్పాదులు సాంసారిక చింతను దీనికి విపరీతముగా జన్మ మరణములకు కారణమనిరి.

15) శ్లో॥విజ్ఞానమహావిజ్ఞతమోఽస్తి కో వా
నార్యా పిశాచ్యా న చ పంచితో యః ।
కా శృంఖలా ప్రాణభృతాం హి నారీ
దివ్యం వ్రతం కిం చ సమస్తదైన్యమ్ ॥

1. ప్ర॥ బుద్ధిమంతులలో బుద్ధిమంతుడెవరు ?
జ॥ స్త్రీ పిశాచిని ద్వారా మోసపోనివాడు బుద్ధిమంతులలో బుద్ధిమంతుడు.

2. ప్ర॥ ప్రాణిమాత్రునకు సంకెళ్ళు ఏవి?
జ॥ స్త్రీయే బంధనము.

3. ప్ర॥ శ్రేష్ఠమైన వ్రతమేది ?
జ॥ సంపూర్ణముగా విసయముగలవాడే శ్రేష్ఠవ్రతావలంబకుడు.

స్త్రీని గురించి యింతకుమునుపు చెప్పడమైనది. మొదట్లో చెప్పిన రీతిగా దోషము పురుషులయొక్క చెడిన మనస్సే గాని స్త్రీలది కాదు.

వివరణ : ఇచట స్త్రీల గురించి చెప్పినది సన్యాసినిగురించిగాని సాధారణ సంసారిని గురించి కాదు. సన్యాసులు స్త్రీ నుండి దూరముగా నుండుట అత్యావశ్యకం. అందులకే సన్నాసుల పక్షం దృష్టిలో నుంచుకొని స్త్రీ రూప పిశాచిని ద్వారా మోసపోనివాడు బుద్ధిమంతులలో బుద్ధిమంతుడు అనిరి. తులసిదాసు రామాయణములో డోలు, పశువు, నారి యివన్నియు తాడనము చేయుటకు యోగ్యులనిరి. అంటే ప్రపంచములో వున్న అందరి స్త్రీలను కొట్టమని కాదు. సీతవంటి సాధ్వీమణులను పూజించుచు, శూర్పణఖ వంటి దుష్టస్త్రీలను తాడించమని అర్థము. అందులకే ఎచట స్త్రీలు పూజింప బడుదురో అచ్చట దేవతలు వసింతురు అనిరి. ఈ కాలములో రామకృష్ణ పరమహంస, శారాదాదేవిని జగన్మాత రూపముగా పూజించిరి, కాని ఆమెను సాధారణమనుషుల దృష్టితో చూడలేదు. అందులకే బ్రహ్మజ్ఞాని యొక్క తల్లి కృతార్థురాలు ; కులము పవిత్రము ; పృథ్వికూడా పుణ్యాత్మురాలు అని చెప్పిరి. అసలు స్త్రీలు లేనిచో సన్నాసులు ఎచ్చటనుండి పుట్టుదురు ? సన్యాసి జ్ఞానమును పొందిన అతని తల్లియే కృతార్థురాలు అగుచున్నది. ఈ విధముగా శాస్త్రములలో మంచి స్త్రీలను స్తుతించిరేగాని నిందించలేదు. కాని నీతికారులు స్త్రీ బుద్ధిః ప్రళయాంతికా అని చెప్పిరి. అంతే గాకుండా అసలు సీతమ్మవారిని అగ్నిలో ప్రవేశింపజేసి వేదవతిని సీతరూపములో పుంచెను సీతాపహరణమునకు ముందు. ఆసకలు సీత లక్ష్మణుని గట్టిగా తిట్టి పంపివేసినది. అపుడు లక్ష్మణుడు స్త్రీల సహజబుద్ధిని వర్ణించుచు ఈ విధముగా చెప్పెను.

విముక్తధర్మా చపలా ! తీక్ష్ణా భేదకారికాః ।

ఇది వాల్మీకి రామాయణములో చెప్పబడినది, స్త్రీలు – ధర్మమును పరిత్యజించువారు, చపలచిత్తులు, హృదయము భేదించు తీక్షణమైన వాక్కు గలవారు, అన్నదమ్ములు మొదలగువారి యందు భేదబుద్ధి కలిగించువారు. అటువంటి స్త్రీ పిశాచినుల మోహమునకు లొంగనివాడు బుద్ధి మంతులలో బుద్ధిమంతుడు మరియు అటువంటి స్త్రీయే బంధనము అని చెప్పిరి.

శ్రేష్ఠవ్రతము పరిపూర్ణవినయ భావము. విద్యాదదాతి వినయం అను నీతివాక్యము ప్రకారము విద్యనప్రతనిచ్చును. సాధారణముగా జనులు లౌకిక విజ్ఞానమును విద్య అందురు. కాని, శాస్త్రములో అవిద్యకు వ్యతిరేకమయిన జ్ఞానము విద్య. ఆ జ్ఞానము పొందినవాడు మమతాభిమానములు లేకుండుట వలన పరిపూర్ణ వినయవంతుడై యుండును. స్వామి విజ్ఞానానందగారు అలహాబాద్ (తోవలో నడచివెళ్ళునపుడు ఆయన కోటువాలకము చూచి పిల్లలందరు కోతి – కోతి యని అరచెడివారు. అపుడువారు – నేను రాముల వారి కోతిని, రాముల వారి సేవ సేయుచున్నాననెడి వారు. విద్యావంతులు కనుకనే, జ్ఞానసంపన్నులు కనకనే, అట్లనగలిగిరి. కలకత్తాలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అను మహావిద్యావంతుడు ఒకసారి ఎవరో ఒక పెద్దమనిషిని ఆహ్వానించుటకు స్టేషనుకు వెళ్ళెను. బండినుండి దిగిన పెద్దమనిషి అటుయిటు చూచి కూలివాడు కనుపించక, సాధారణ వంచె – చొక్కాలతో వున్న ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్‌ను కూలి అనుకొని ఆయనను, పిలిచి ఆయనచే సామాన్లు మోయించుకొని వారి యింటికి వెళ్ళెను. ఆ సామానులు హాలులో బయట దించుచుండగా ఆ పెద్దమనిషి ఈశ్వర్ చంద్రవిద్యాసాగర్‌ను పిలువమని చెప్పెను. లోపలకు వెళ్ళి కాళ్ళు కడుగుకొని నియమించిన స్థానములో వారే వచ్చి కూర్చుండిరి; వచ్చిన పెద్దమనిషి చాలా సిగ్గుపడెను. వారు విద్యాసాగరులు, కనుకనే వినయ సంపన్నుడై మెలిగెడి వారు. ఒకసారి గురువుగారిని నిందించుచున్న పెద్దమనిషిని ఆయన చెప్పుతో కొట్టిరి. వీరిని మిగిలినవారు – మీరు చెప్పులు ధరించరు గదా ! చెప్పుతో ఎట్లు కొట్టితిరి ? అని అడుగగా యిచ్చిన సమాధానమిది –వాని చెప్పును తీసి వానినే కొట్టితినని చెప్పులు ధరించని, మరియు సామాన్య వస్త్రములలోనున్న యీయనను చూచి అభిమానులకు భ్రమ కలిగే తీరును. కనుకనే శంకరులు యిచ్చట పూర్ణ వినయభావమే శ్రేష్ఠతమమనిరి.

16) శ్లో॥జ్ఞాతుం న శక్యం చ కిమస్తి నర్వైః ।
యోషిన్మనో యచ్చరితం తదీయమ్ ॥
కా దుస్త్యజా సర్వజనైర్దురాశా ।
విద్యావిహీనః పశురస్తి కోవా ॥

1. ప్ర॥అందరు తెలుసుకొనుటకు శక్యము కానిది ఏది ?
జ॥ స్త్రీల మనస్సు, వారి యొక్క చరిత్ర.

2. ప్ర॥అందరికి పదిలిపేయుటకు అత్యంత కఠినమైనదేది ?
జ॥ చెడు వాసనలైన విషయభోగములు, పాపము చేయుటకు యిచ్చ అందరికి పదిలిపేయుట అతికష్టము.

3. ప్ర॥పశువు ఎవరు ?
జ॥ విద్యా విహీనుడైన మూర్ఖుడే పశువు.

వివరణ :భార్యయొక్క స్త్రీ స్వభావమును, మనోగతిని, చరిత్రను తెల్సుకొనలేక భర్తృహరి తమ్ముని అడవులకు పంపెను. భార్యయొక్క చరిత్ర తెలిసిన తరువాత తమ్మునకు రాజపట్టము గట్టి, రాజ్య భోగములను పరిత్యజించి అడవిలో సాధన చేయుచుండెడివారు. భాగవతములో ఆత్మదేవుడు భార్యయైన దుందలి చేసిన మోసము వలన అనేక కష్టము లను భవించెను. నీతికోవిదులు స్త్రీలకు ఆహారము ద్విగుణము, బుద్ధి నాలుగురెట్లు, సాహసము ఆరురెట్లు, కామము ఎనిమిదిరెట్లు అనిరి. అందులకే ఆహారము తగ్గించి, బుద్ధిని సరియైన త్రోవలో పెట్టి, సాహసమును పదిలి, కామమును నిగ్రహించిన స్త్రీలు సతీమణులైరి. వీటిని నిగ్రహించనివారు చపలచిత్తులై కట్టుకొన్న వారినే మోసగించుట మొదలిడిరి. అటువంటి చపలచిత్తులైన స్త్రీల మనోగతి మరియు చరిత్ర తెలుసుకొనుట ఎవరివలనను శక్యము కాదనిరి శంకరులు.

విషయవాంఛలు, పాపకర్మానుష్ఠానము అతికష్టము మీద, కఠోర సాధనానంతరమే తొలగును.

రసవర్జం రసోఽప్యస్య పరందృష్ట్వా నివర్తతే – **(2-59)** గీతోక్తి. అనగా విషయభోగములనుండి దూరమైనను, మనస్సులో నున్న సుషుప్త కామవాంఛ స్వాత్మానుభవమైన తర్వాతనే తొలగును. అనేకజన్మల వాసనలు, అజాగ్రత్త మనసులో నుండును. వానిని తొలగించుటకు కఠోరసాధన చేయవలయును. అందులకే జ్ఞానిగూడ అనేక జన్మల తర్వాతనే పరమాత్మను పొందుననియు, పరమాత్మమయముగా ప్రపంచమును చూచువాడు దుర్లభుడని కృష్ణపరమాత్మ నుడివిరి. అపతార

పురుషులైన బుద్ధుడు, రామకృష్ణ పరమహంస విద్యారణ్యస్వామి మొదలైనవారు తీవ్రసాధన చేసిరనునది లోక విదితము. కనుకనే యిచట శంకరులు చెడ్డవైనవిషయ భోగవాంఛలు మరియు పాపాచరణ కోరిక త్యజించుట అతికష్టమనిరి.

ఆహారము, నిద్ర, భయ, మైథునము అన్ని ప్రాణులకు సమానము. ఇవి గాక ధర్మాచరణము గావించుచు సద్గతికి పాటుపడువాడే మనిషి. దేవతలు కూడ భగవత్ప్రాప్తి కోసం మనుష్యజన్మకై తపించుచుందురు. జీవ జంతువులకు ధర్మాను స్థానము లేదు. అవన్నియు కేవలము భోగయోనులు. ఇంక అసురులు, ఇంద్రియ లోలురు – క్రూరులు. కనుక వారికి గూడా ధర్మాచరణము లేదు. ఇక, ఒక్క మనుష్యజన్మలోనే సద్గతికి త్రోవయున్నది. అటువంటి మనుష్య జన్మనెత్తి, దానిని సక్రమముగా వినియోగించక, జంతువులు రాక్షస పర్గములలో చేరుట బుద్ధిపొరపాటుగదా ? ధర్మాచరణము గావించిన ధర్మరాజు స్వర్గమునే పొందెనుగాని మోక్షమును పొందలేదు. అట్లే సాక్షాత్తు భగవంతుని సఖుడైన అర్జునుడు, భగవంతునిచే గీత ఉపదేశము పొందినను స్వర్గమునే చేరెను. అట్టి ధర్మపరాయణులకే మోక్షము కల్గనిచో అసలు ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించనివారు, ఇంద్రియలోలురు, పరమాత్మ విముఖులు, విషయలోలురు, మూర్ఖులైన వారు పశువులు గాక ఏమగుదురు ?

17) శ్లో॥వాసో న సంగః సహ కైర్విధేయో
మూర్ఖైశ్చ నీచైశ్చ ఖలైశ్చ పాపైః
ముముక్షుణా కిం త్వరితం విధేయం
సత్సంగతిర్నిర్మ మ తేశభక్తిః ॥

1. ప్ర॥ ఎవరితోబాటు సాంగత్యము, నివాసము చేయరాదు ?

జ॥ మూర్ఖులతో, నీచులతో , దుష్టులతో మరియు పాపులతో సాంగత్యము మరియు నివాసము చేయరాదు.

2. ప్ర॥ ముక్తి కాపలయుననిన త్వరగా ఏమి చేయపలయును ?

జ॥ సత్సాంగత్యము, మమతా త్యాగము, పరమేశ్వరుని భక్తి ముక్తిపలయు వారు త్వరితముగా చేయవలెను.

వివరణ : మూర్ఖుల సాంగత్యము, మరియు వారితో ఉండుటవలన వివేకము నశించును. నీచులతో నుండుట వలన కుత్సితస్వభావము లేర్పడును. దుష్టులతో నుండిన క్రూర స్వభావము, పాపులతో నుండిన నరకము లభించును. వీనివల్ల ఆధ్యాత్మిక సాధన సాగదు ; మరియు ఉన్నతిని పొందలేరు గనుక వీరి సాంగత్యము, సహవాసము చేయరాదనిరి. అటువంటి వారి నుండి ఆహారము గ్రహించిన బుద్ధి నశించును. దీనికి భీష్ముడు ఉదాహరణము. దీనికి విరుద్ధముగా ఆత్మనిష్ఠుల మరియు దైవచింనగలవారి ఆహారము పరపురానిదై యుండును. రాములవారికి కైకేయి, సీత, జనక పరివారము యింకను తదితరులు విందుభోజనములు పెట్టి ఎట్లున్నదని అడుగగా బాగానే యున్నది కాని, శబరి పెట్టిన రేగిపండ్లరుచి రాలేదని చెప్పెడివారు. మూర్ఖులు మొదలైన వారితో కాలక్షేపము చేయుటకంటె ఏకాంతముగా నుండి భజనచేయుట మేలు. శౌచమనగా శుభ్రత. ఆంతరిక శుభ్రత, బహిరంగ శుభ్రత వీరిలో (మూర్ఖులలో) యుండదు. అదికూడా సాధనాపరులకు ఆటంకమే గదా ! అందుకే శంకరులు వీరినుండి దూరముగా నుండవలెననిరి.

ముక్తికోరువారు మమతాశూన్యులై, సత్పురుషుల సాంగత్యము కావించుచు పరమేశ్వరుని యందు భక్తికలిగి యుండవలెను. కృష్ణార్జునులకొకసారి ఒక బ్రాహ్మణుడు అర్ఘ్యపాద్యాదులిచ్చి, కూర్చుండబెట్టి, యింటిలోనున్న ఆవుపాలు పిదికి వారికి త్రాగుటకిచ్చెను. తృప్తిగా త్రాగిన తరువాత కృష్ణపరమాత్మ అతని గోవు మరణించునట్లు దీవించెను. ఎందులకనగా ఆవుపై అతనికి మమకారమెక్కువ ; దైవ చింతనకు ఆటంకపడు చుండెను. ఆటంకమును తొలగించి భక్తిని పూర్తిగా పరమేశ్వరునిపై నుండునట్లు కృష్ణపరమాత్మగావించెను. భార్యాపుత్రాదులపై గాక స్వశరీరముపై మమత యుండినను జపధ్యానములకు ఆటంకము గల్గుచుండెను. అందులకే శరీరముతోపాటు బాహ్యవస్తువులపై కూడా వ్యామోహము విడువ వలెను.

ఇంటిలోవున్న తాగుబోతును, భార్యాపుత్రులు, బంధు బాంధవులు అందరు పదిలివేసిరి. వాని మిత్రుడు ఒకసారి మహాత్ముని యొద్దకు పోయి వీరి కథ చెప్పి, అందరు పదిలివేసిన నా మిత్రుని దుఃఖము చూడలేకున్నాననెను. మహాత్ముడు త్రాగుబోతు వద్దకు పోయి, ప్రేమతో వాని యోగక్షేమములు విచారించి, స్వహస్తములతో ప్రసాదమును తినిపించి, తన ఆశ్రమమునకు రమ్మని చెప్పెను. ఏకాంతములో ఆలోచించుచు, అందరు పదిలివేసిన నన్ను ఆదరించిన ఈ మహాత్ముడెవరా

అని త్రాగుబోతు వారివద్దకు పోయెను. మహాత్ముడు కుశలప్రశ్నలు వేయుచు, భగవత్ చర్చ చేయుచుండెడివాడు. ఆతని ప్రేమకు లోబడి త్రాగుబోతు త్రాగుడుతో బాటు సర్వమును త్యజించి సన్యాస ఆశ్రమము స్వీకరించెను. అందులకే భజగోవిందమునందు సత్సాంగత్యము వలన వైరాగ్యము, వైరాగ్యము వలన నిర్మోహత్వము (మమతాశూన్యత), కలుగునని. మమతాశూన్యమైన మనస్సు ఏకాగ్రమగును. ఏకాగ్ర మనస్సును భగవంతునిపై నిల్పిన జీవన్ముక్తి కల్గుననిరి.

పరమేశ్వరునిపై భక్తిలేనిదో మనశ్శాంతి ముక్తి కలుగదు. ఆత్యంతిక దుఃఖనివృత్తి, ఆత్యంతిక సుఖప్రాప్తినే మోక్షమందురు. దానికై మల, విక్షేప, ఆవరణాలను ప్రతిబంధకములను నివారించ వలెను. కర్మఫలములను ఆశింపక నిష్కామముగా కర్మములను ఆచరించుట వలన అంతఃకరణములో నున్న మలమనెడి పాపము దూరమగును. భక్తి, ధ్యానము, స్తోత్రపఠన, నిరంతరోపాసన ద్వారా ఆవరణము దూరమై జీవుడే ఈశ్వరుడు అగును. మట్టిలేనిదే కుండలేదు ; ఇంధనము లేనిదే అగ్నిలేదు ; అట్లే పరమేశ్వరునిపై భక్తిలేనిదే మోక్షము గలుగదనిరి శంకరులు.

18) శ్లో॥లఘుత్వమూలం చ కి మర్ధి తైవ
గురుత్వ మూలం యదయాచనం చ ।
జాతో హి కో యస్య పునర్న జన్మ
కో వా మృతో యస్య పునర్న మృత్యుః ॥

1. ప్ర॥ తక్కువ తనము (చిన్నచూపు) నకు మూలమేది ?
జ॥ యాచనమే చిన్నచూపునకు కారణము.

2. ప్ర॥ గొప్పతనమునకు మూలమేది ?
జ॥ ఎవరిని ఏది అడగకుండుట గొప్పదనమునకు మూలము.

3. ప్ర॥ ఎవరి జన్మ ప్రశంసనీయము ?
జ॥ ఎవరు మరల జన్మనెత్తరో వారు ప్రశంసనీయులు అనగా ముక్త పురుషుల జన్మ ప్రశంసనీయము.

4. ప్ర॥ ఎవ్వరి మృత్యువు స్తుతి యోగ్యము ?
జ॥ ఎవరు మరల మృతినొందరో వారే స్తుతియోగ్యులు, అనగా ముక్తపురుషులు.

వివరణ : యాచించు వానిని ప్రతి ఒక్కరు చిన్నచూపుతో చూచెదరు.

యదస్మదీయం నతత్ పరేషాం
యత్ పరేషాం న తదస్మదీయమ్ ॥

ఎప్పుడూ యితరులది మనది కాదు. మనదెప్పుడూ యితరులదికాదు. ప్రారబ్ధవశమున, భాగ్యవశమున, అదృష్ట వశమున యిచ్చేది భగవంతుడు ప్రసాదించునదే ! ఉన్నవాటితో సంతృప్తి చెందిన యాచనకు అక్కర పుండదు. అట్లుగాక లేనిపోని ఆడంబరములకు పోయిన యాచనచేయవలసి వచ్చును. శారదాదేవికి పరమహంస చెప్పిన ఉపదేశములలో యిది ఒకటి – ఎవరిని యాచింపవద్ద ని. ఒక్కొక్క సారి ఆమెకు పండుకున్న కూరలోకి ఉప్పుకూడా ఉండెడిది కాదు. ఆమె అట్లే భుజించెడిది కాని, ఉప్పు సహితము ఎవరిని యాచించెడిది కాదు. ఇతరులను యాచించి నిన్ను, నీవు చిన్న బుచ్చుకొనవద్దని భగవత్పాదుల ఉపదేశము. అందులకే వారు ఎవరిని ఏమి అడుగకుండుటయే గొప్పదనమునకు మూలమని నుడివిరి.

ఎవరి జన్మ మృత్యువులు స్తుతియోగ్యములని అడుగగా, మరల ఎవరు జన్మ మరణములను పొందరో వారే స్తుతియోగ్యులనిరి. జన్మకు సార్థకత మోక్షమువలననే ! బ్రహ్మనిష్ఠులైన యోగులను, భక్తులను, జ్ఞానులను చూచి దేవతలు గూడా భయపడుదురు. ముక్తి పొందిన మహాపురుషులను ప్రపంచమంతయు ఎల్లప్పుడూ స్తుతించుచునే యుండును. ఈ కోవకు చెందినవారే ప్రశ్నోత్తరి రచయిత శంకరులవారు. రామకృష్ణపరమహంస, వివేకానందులు, షిర్డీసాయిబాబా, కబీరు, తులసీదాసు, వేమన, బమ్మెరపోతన, యిత్యాదులు ఈ కోవకు చెందినవారే ! ఈ మహాపురుషులకు జన్మ మరణములు మరల లేవు. కావున జనులు ఎల్లప్పుడూ స్తుతించుచునే యుందురు.

19) శ్లో॥మూకోఽస్తి కో వా బధిరశ్చ కో వా
వక్తుం న యుక్తం సమయే సమర్థః ।

తథ్యం సుపథ్యం న శృణోతి వాక్యం
విశ్వాసపాత్రం న కిమస్తి నారీ ॥

1. ప్ర॥ మూగవాడెవడు ?

జ॥ అవసర, అనవసర సమయములను తెలిసి ఉచితమైన వాక్యములను చెప్పలేని వాడే మూగవాడు.

2. ప్ర॥ చెవిటి వాడెవడు ?

జ॥ యథార్థము, మరియు హితము కొఱకు చెప్పు వచనములు విననివాడు.

3. ప్ర॥ నమ్మదగని దేది ?

జ॥ నారియే నమ్మదగనిది.

వివరణ : కౌరవుల సభలో ద్రౌపది వస్త్రాపహరణ సమయమున ధర్మములన్నియు తెలిసియుండియు భీష్ముడు ఏమియు చెప్పలేదు. అందులకే సమయము వచ్చినపుడు సరియైన వచనములను చెప్పలేని వానిని మూగవాడనిరి. సామాన్యముగా జనులు వేరు మార్గముల ద్వారా సంపాదించి మంచివారిని చులకనగా చూచెదరు. అటువంటి వారిపద్ద, అవసరమైనపుడు యథార్థమును చెప్పలేని వారిని మూగవారనిరి.

సత్యము, శ్రేయస్కరమైన విషయములను విననివాడిని చెవిటి వాడనిరి. దుర్యోధనునికి ఎంతమంది హిత బోధలు చేసినను, కృష్ణపరమాత్మ యాథార్థహితమును బోధచేసినను వినలేదు. అటువంటి వానిని చెవిటివాడందురు. మండోదరి, విభీషణుడు, మాల్యవంతుడు మొదలగువారు ఎన్ని హితబోధలు చేసినను రావణుడు వినలేదు. చెవిటివారై యిరువురు వంశనాశనము చేసికొనిరి.

స్త్రీలు విశ్వాసపాత్రులు కాదని యింతకు ముందు కూడా చెప్పినాము. స్త్రియాశ్చరితం దేవో న జానాతి కుతో మనుష్యః దేవతలు కూడా స్త్రీల చరిత్ర తెల్సుకోలేరు ; అంటే అందరూ ఈ కోవకు చెందినవారు కాదు, వారిలో చాలా మంది పతివ్రతలున్నారు. ఉదాహరణకు పాండ్యదేశములో నివసించిన కన్నగి భర్తను, రాజు నేరారోపణచేసి చంపిన కారణముచే ఆమె శాపమొసగి ఆరాజ్యమును భస్మము గావించినది.

20) శ్లో॥ తత్త్వం కిమేకం శివమద్వితీయం
కిముత్తమం సచ్చరితం యదస్తి ।
త్యాజ్యం సుఖం కిం స్త్రియమేవ సమ్యగ్
దేయం పరం కిం త్వభయం సదైవ ॥

1. ప్ర॥ తత్త్వమేది ?

జ॥ అద్వితీయమైన కళ్యాణ తత్త్వము. దానినే పరమాత్మ తత్త్వము అందురు.

2. ప్ర॥ అన్నిటిలో ఉత్తమమైన దేది ?

జ॥ సదాచరణమే శ్రేష్ఠమైనది.

3. ప్ర॥ పదలివేయవలసిన సుఖమేది ?

జ॥ అన్నివిధములుగా స్త్రీ సుఖమునే పదలి వేయవలయును.

4. ప్ర॥ ఇచ్చుటకు యోగ్యమైన దానమేది ?

జ॥ అభయదానమే యోగ్యము మరియు ఉత్తమమైనది.

వివరణ : శ్రుతి పాపం యితి శివః – శం అనగా కళ్యాణం కరోతి ఇతి శంకరః । ఎల్లప్పుడూ శుభమును చూకూర్చునది ; అది పరమాత్మ తత్త్వమే. అది అద్వితీయ పరమాత్మ చైతన్య తత్త్వమే. ఆ తత్త్వ చింతన చేయువానికి పాపము నశించును. శుభములు కలుగును. అస్తి, భాతి, ప్రియం, నామ, రూపములు అను ఐదింటిలో మొదటి మూడు పరమాత్మకు చెందినవి ; మిగిలిన రెండు ప్రపంచమునకు చెందినవి. అస్తి అనగా ఎల్లప్పుడు ఉండు వస్తువునకు ఉనికి, భాతి అనగా స్వయముగా ప్రకాశించుచు జ్ఞానము నొసగునది. ప్రియ మనగా ఆనందమును చేకూర్చునది. అందుకే పరమాత్మ స్వరూప లక్షణము సచ్చిదానంద రూపము. ఇవి మూడు ప్రతి వస్తువులోను వున్నవే. అందులకే వస్తువు ఉన్నది ; కనిపించుచు ఉన్నది; ఆనందము

నిచ్చుచున్నది ; లేక ఉపయోగపడుచున్నది ఉదా :- పచ్చగడ్డి ఉన్నది ; కనిపించుచున్నది దానిని తినిన ఆనందము కలగును అని గాడిదకు, కూడా తెలియును. కాని గాడిదకు అజ్ఞానికి అదే పరమాత్మ స్వరూపమని తెలియదు. మిథ్యయైన నామరూపములను పట్టుకొని ప్రేలాడుదురు. అందులకే ఇచట శంకరులు అద్వైత పరమాత్మ తత్త్వమే తత్త్వమనిరి.

శ్రేష్ఠమైనది ఉత్తమాచరణము. ఆచారహీనం న పునంతి వేదాః ఆచారహీనులను వేదములుగాని, పరమాత్మగాని, మరి యింకొకటి ఏదైనగాని పవిత్రము చేయలేవు. ఉత్తమాచరణమువలన అంతఃకరణము త్వరగా పరిశుద్ధమై స్వాత్మానుభవమునకు దగ్గర చేరును. నికృష్ట ఆచరణము వలన పాపము వృద్ధియగును. సంసార దుఃఖములు తరగవు. ఉత్తమాచరణము కావించిన అత్రి, వశిష్ఠాదులను, అసూయ అరంధతులను సదా స్మరింతురు. ఈ కాలములో శ్రేష్ఠ ఆచరణము గావించిన రామకృష్ణ పరమహంస, షిర్డీసాయిబాబా, కన్నగి, అక్కమహాదేవి మొదలగు వారిని ఎల్లప్పుడూ స్మరించుట పాఠకులకు తెలిసినదే ! అందువలన యిచట ఉత్తమా చరణమే ముఖ్యమనిరి.

అన్నివిధములుగా స్త్రీ సుఖమును పదిలపేయ పలయును. పదలలేని వారి బాగోగులు అందరికి తెలిసినవే ! అనేక జన్మల నుండి అందరూ ఈ కామభోగములను భవించుచునే యున్నారు. అధమ పక్షము మొదటి నుండి ఈ ఒక్క జన్మ భగవంతుని కర్పించిన మరల జన్మ ప్రసంగముండదు. అట్లు చేయలేకున్న,

యదహరేవ విరజేత్, తదహరేవ ప్రవ్రజేత్ ।

ఏ దినమున వైరాగ్యము వచ్చిన ఆదినమే అన్నీవదలి సన్యసించవలెను. అందులకే గృహస్థులకు జ్ఞానప్రాప్తికై సంకల్ప త్యాగము, మనోనాశనము కావించవలెను. ఏది ఎట్లున్నను, పురుష సాధకులు, స్త్రీల నుండి దూరముగా నుండుట, అట్లే స్త్రీ సాధకులు పురుషులనుండి దూరముగా నుండుట అవసరము.

ఇచ్చుటకు యోగ్యమైన దానము అభయమే ! అభయ దానమును మించిన దానము లేదు. ఒకసారి జనకుని సభకు వచ్చిన యాజ్ఞవల్క్యమహర్షి జనకుని, ఎవరు ఎవరు నీకు ఏయే ఉపదేశములు చేసిరి ? అని అడిగిరి. దానికి జనకులు ఒక్కొ క్క ఉపదేశము చెప్పుచుండగా, అది అసంపూర్ణము అని చెప్పుచూ, దానిని సాంగోపాంగముగా జనకునికి చెప్పుచుండిరి. ఒక్కొక్క ఉపదేశము చెప్పుచుండగా రాజు మహర్షికి **1000** గోవుల దానమిచ్చెదనని చెప్పెను ; దానికి మహర్షి కృతకృత్యుడు కాని శిష్యుని వద్ద నుండి దానము తీసికొనరాదని దానము స్వీకరించెడివాడు గాదు. ఈ విధముగా అనేక పర్యాయములు ఉపదేశము వినిన రాజు ఆఖరిలో మహర్షితో, ఈ రాజ్యమంతయు మీకు సమర్పించుచున్నా ననెను. అపుడు యాజ్ఞవల్క్యుడు, అభయం పై జనక ప్రాప్తోఽసీతి హోవాచ - అనగా, ఓ జనకుడా ! నీవు అభయపదమును పొందితివి. అనెను, మమత, దేహాభిమానములు సంపూర్ణముగా విడిచిన మోక్షమును పొందెదరని అర్థము. చేతనైన వారు యాజ్ఞవల్క్యునివలె జ్ఞానదానము చేసి అభయమునొసంగవలెను ; లేనిచో కనీసము శిబిచక్రవర్తివలె, ప్రాణభీతితో వచ్చిన వారికి అభయదానమొసంగవలెను. అందులకే శంకరులు యోగ్యమైన ఉత్తమదానము అభయమనిరి.

21) శ్లో॥శత్రోర్మహాశత్రుతమోఽస్తి కో వా
కామః సకోపాకృతలోభతృష్ణః ।
న పూర్యతే కో విషయైః న ఏవ
కిం దుఃఖమూలం మమతాభిధానమ్ ॥

1. ప్ర॥శత్రువులన్నిటిలో పెద్ద శత్రువేది ?
జ॥ క్రోధము, అసత్యము, లోభము, తృష్ణలతో కూడిన కామము.

2. ప్ర॥విషయభోగముల ద్వారా తృప్తి పొందనిది ఏది ?
జ॥ పైన చెప్పినదే విషయ భోగములద్వారా ఎన్నటికి తృప్తి పొందదు.

3. ప్ర॥దుఃఖములకు కారణమేది ?
జ॥ మమత సర్వదుఃఖములకు కారణము.

వివరణ : కామము వలన క్రోధము, క్రోధము వలన బుద్ధినాశనము, ఇంతకు ముందు తెలిపినాము. క్రోధము అన్నిరకముల అసర్థములకు కారణము. ఇక అసత్యము సమూలముగా వంశనాశనము చేయునని ఉపనిషద్వాక్యం. సత్యమేవ జయతినాఽన్న

తమ్ । మహాత్మాగాంధి సత్యమే దేవుడనెడివారు. తులసీదాసుగారు – సహి అసత్యసమపాతక పుంజ । గిరి సమహోయిహి కోటికగుంజ । అనిరి. అసత్యము సకు మించిన పాపము లేదు. కోటి గురివిందగింజలు రాశిగాపోసినను పర్వతాకారమునకు సరిగావు. అట్లే అనేకపాపములు చేరినను అసత్యమునకు సమము కావు. భర్తతో అసత్యమాడి, పెనిమిటి మాటను పెడచెవిని పెట్టి, అగ్నిగుండములో దేహము చాలించి, మరల జన్మమంతయు తపస్సు కావించిన పార్వతీదేవి విషయము అందరికీ తెలిసినదే ! ఇది అంతయు అసత్యమాడిన పాపమునకు ప్రమాణము. గురుకుల వాసమునుండి సమావర్తనము (విద్యపూర్తి అయిన తరువాత) కావించి పంపించు బ్రహ్మచారికి చేయు మొదటి ఉపదేశం – సత్యం వద, ఈ రెండు వదముల వ్యాఖ్యానము ధర్మరాజు జీవనము, హరిశ్చంద్రోపాఖ్యానము. రామకృష్ణుని తండ్రి – అసత్యము పలుకమని చెప్పిన గ్రామాధికారి వచనము పాలించక, సత్యమునే చెప్పెదనని చెప్పుచూ, పాలము – యిల్లు గ్రామాధికారికి పదిలివేసి వేరొక గ్రామమునకు కట్టుబట్టలతో పోయెను. అంతటి సత్యనిష్ఠ ప్రతుడు గావుననే వారికి రామకృష్ణపరమహంస వంటి మహాత్ములు జన్మించిరి. అందులకే అసత్యము శత్రువులన్నిటిలో ప్రబలశత్రువని శంకరులు చెప్పిరి.

లోభమనిషి తాను తినడు, యితరులకు యివ్వడు. అందులకే వాని ద్వారా కూడబెట్టిన ధనము పరుల సుఖమునకు తోడ్పడును. తులసీదాసు చెప్పిన దేమంటే – లోభమనెడి పాశము ఎవరిని బంధించలేదో ఆనరుడు రామునితో సమానమనిరి. మనిషిలోని ముఖ్యమైన లోపమే లోభము. లోభము వలన వీని యందు సంగ్రహబుద్ధి అధికమగును. అందుచే దానధర్మములు చేసి సద్గతిని పొందుటకు కూడా ప్రయత్నించడు. మనిషికి దానము చేయవలయునని ఉపదేశము. రాజ్యలోభమువలన దుర్యోధనుడు సర్వనాశనమాయెను.

తృష్ణవిపరీతమైన శత్రువు అనిరి. తృష్ణా న జీర్ణా వయమేవ జీర్ణాః । ఆశచావలేదు గాని మేమే చనిపోయినామనిరి. అందకనే చింతచచ్చినా పులుపు చావలేద ని సామెత. తృష్ణ అనగా – కోరిన విషయము ఉండియే తీరవలెను – లేనిచో గడవదను తీవ్రమైన కోరిక. ఈ తృష్ణయే మనిషిని పిచ్చివానిని చేయును. కనుకనే శంకరులు యిచ్చట ముఖ్యశత్రువనిరి.

క్రోధము, అసత్యము, లోభము, తృష్ణ వీని గురించి విడివిడిగా చెప్పినాము. కాని ఇచ్చట శంకరుల ముఖ్యోపదేశమే మనగా వీనితో కూడిన కామము పెద్ద శత్రువనిరి. ఈ గుణములు ఒక్కొక్కటి మాత్రమే ఆధ్యాత్మిక ఉన్నతికి బద్ధశత్రువులైన వీనితో కూడిన కామము గురించి వేరుగా చెప్పవలెనా ? విషయభోగముల ద్వారా తృప్తిచెందనిది ఈ కామమే ! దీనిని వివరించుచు యింతకు ముందు యయాతి ఘటన చెప్పినాము.

మమతయే దుఃఖములకు మూలకారణము. ఈ మమత వలననే భార్యాబిడ్డలు, బంధువులయందు ప్రేమచూపించుచూ జీవితము అంతము కావించుకొందుము. ఆధ్యాత్మికోన్నతికి మమతవున్నవారు పాటు పడలేరు. కనుక శంకరులు ఈ మమతే భవరోగ దుఃఖమునకు మూల కారణమనిరి.

22) శ్లో॥కిం మండనం సాక్షరతా ముఖస్య
సత్యం చ కిం భూతహితం సదైవ ।
కిం కర్మ కృత్వా న హి శోచనీయం
కామారికంసారి సమర్చనాఖ్యమ్ ॥

1. ప్ర॥ముఖమండలమునకు భూషణము ఏది .
జ॥ విద్యయే వదనమునకు భూషణము.

2. ప్ర॥యధార్థమైన కర్మమేది ?
జ॥ ఎల్లప్పుడు ప్రాణిమాత్రులకు హితము చేయుటయే యధార్థకర్మ.

3. ప్ర॥ఏ కర్మచేసి శోకింపనవసరము లేదు ?
జ॥ శివకేశవుల పూజచేసిన శోకింపనవసరము లేదు.

వివరణ : విద్యలేనివాడు వింతపశువు, విద్యగలవాడు సర్వత్రపూజింప బడును. విద్యాదానమే పరదేశములలో బంధువు ; మరియు దీనిని ఎవరునూ దొంగిలించలేరు. దీనిని ఎంతదానము చేసిన అంత పెరుగును. అష్టవంకరులు గల అష్టావక్రుడు కూడా విద్యవలననే జనకుని సభలో పూజింపబడెను. అందులకే విద్యయే ముఖమునకు భూషణము అనిరి.

ప్రాణిమాత్రులకు హితము చేయుటయే అసలైన కర్మ. పరమాత్మ సర్వప్రాణులలోను ఉన్నాడు. వానిని చూచుచు అందరికీ సేవ చేయుటయే ఉత్తమమైన కర్మ.

శివ, కేశవుల పూజచేసిన శోకింపనవసరము లేదు. వేదవిహిత కర్మలు, వర్ణాశ్రమ ధర్మములు ఆచరించినచో జీవితము వ్యర్థమైనదని శోకించవలెను. కృష్ణనే కేశవుడందురు. కేశవుడనగా క + ఈశ + అ + వః = కేశవః క అనగా బ్రహ్మ; ఈశ అనగా ఈశ్వరుడు; అ అనగా విష్ణువు ; వపుః అనగా శరీరము; బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల శరీరము గలవాడే కేశవుడు అనగా పరమాత్మ ఆ పరమాత్మను తలచినవాడు దుఃఖముపొంద నవసరము లేదు. భక్తుని యోగక్షేమములు పరమాత్మ వహించును. అందులకే శంకరులు శివకేశవులను పూజించినవారు శోకింపనక్కరలేదు అనిరి.

23) శ్లో॥కస్యాస్తి నాశే మనసో హి మోక్షః
క్వ సర్వథా నాస్తి భయం విముక్తౌ ।
శల్యం పరం కిం నిజమూర్ఖతైవ
కే కే హ్యుపాస్యా గురుదేవపృద్ధాః ॥

1. ప్ర॥ఏది నాశనమైన మోక్షము కల్గును?
జ॥ మనోనాశనమైన మోక్షము కల్గును.

2. ప్ర॥దేనియందు ఎల్లప్పుడు భయము లేదు ?
జ॥ మోక్షమునందే ఎప్పుడూ భయము లేదు.

3. ప్ర॥మనస్సును అధికముగా ఎల్లప్పుడూ నొప్పించున దేది ?
జ॥ తన యొక్క మూర్ఖతే ఎల్లప్పుడు నొప్పించును.

4. ప్ర॥ఉపాసించుటకు యోగ్యులెవరు ?
జ॥ గురు, దేవతా, పృద్ధులే ఉపాసించుటకు యోగ్యులు.

వివరణ : నిస్పృహః సర్వకామేభ్యః ప్రజహాతి యదా కామాన్ । అని గీతోక్తి. అన్ని కోరికలను విరమించుట లేక మనస్సులోనున్న కోరికలు అన్నిటిని వదలివేయుట, ఆస్థితినే స్థితప్రజ్ఞుడు లేక యోగి అనిరి. మనస్సే బంధనములకు లేక మోక్షమునకు కారణము. మనస్సును వశములో నుంచుకొనిన అది మోక్షమునకు చేర్చును. కోరికలు, సంకల్పములు పెంచుకొనిన బంధనములో పడుదురు. కోరికలను నశింపజేసికొని అంతఃకరణను నిరంతర ఉపాసనద్వారా శుద్ధిచేసికొనుటనే మనోనాశనమందురు. దీనినే జీవన్ముక్తి వివేకము లో విద్యారణ్యస్వాములు వాసనాక్షయము, మనోనాశనము, జ్ఞానప్రాప్తి అనిరి. అదే యిచ్చట మనోనాశనము ద్వారా మోక్షము కలుగునని చెప్పిరి. మరియు మోక్షము నందే ఎల్లప్పుడు భయము లేదని చెప్పిరి. మోక్షమనగా శరీరాభిమానము వదలి, నేను శరీరము కాదని, సర్వవ్యాపకుడైన ఆత్మను అనుభవించుటయే ! చైతన్య ఆత్మ ఒకటే అయినందున వేఱొకటి లేదు. భయము వేఱొకదాని వలననే కల్గును. అందులకే మోక్షము నందు భయములేదు అనిరి.

అవివేకదశలో చేసిన కార్యములు వివేకదశలో తలంచినపుడు అత్యధిక పశ్చాత్తాపము కలుగుచుండును. అపుడు ఆ వ్యక్తి తన మూర్ఖతకు తానే భయపడుచుండును. దీనినే శంకరులు తనయొక్క మూర్ఖత్వము మనస్సును అధికముగా నొప్పించుననిరి.

గురువులు, దేవతలు, పృద్ధులు నిత్య ఉపాసనాయోగ్యులు. జ్ఞానులు కూడా వేదాంతము, గురువు, ఈశ్వరునికి ప్రతి నిత్యము నమస్కరించి తీరవలెను. గురువు సాక్షాత్ భగవత్స్వరూపము. అందులకే మనస్సు చంచలముగానున్నప్పుడు గురువుల స్వరూపధ్యానము కావించినమనస్సు శాంతించును. అనుకూలమైన దేవతాస్వరూపమును ఉపాసన కావించినచో ఆతఃకరణము శుద్ధి చెందును. సామాన్యముగా సాధకులు ఏదో ఒక దేవతను ఇష్టదైవము కావించుకొని ఉపాసనచేయుచుందురు. దేవతాధ్యాన సమయములో దేవతయొక్క నామముతో బాటు దేవతారూపము, దేవతాగుణములు, లీలలు, ఆదేవతా ఉనికిని, కలిపి ధ్యానించినచో మనస్సు త్వరగా శాంతినొంది వశములోనికి వచ్చును. ఇచట ఉనికి అనగా దేవత సాన్నిధ్యము.

అభివాదన శీలస్య నిత్యం వృద్ధోప సేవినః ।
చత్వారితస్య వర్ధంతే ఆయుర్విద్యా యశోబలమ్ ॥

పెద్దలకు వినయముతో నమస్కరించువారికి, వారి మాటలు వినిసేవచేయువారికి, ఆయుర్విద్యాయశోబలములు వృద్ధిచెందును. పెద్దలమాటలనువిని, సేవచేసిన, వారి ఆశీస్సులు తప్పక లభించును. శత్రుపక్షములో నున్న భీష్మద్రోణులకు నమస్కరించి, వారి ఆశీస్సులు పొంది, విజయలక్ష్మిని ధర్మరాజు చేకొనెను. శ్రవణకుమారుడు తల్లి దండ్రులకు సేవజేసి, వారి ఆశీస్సులతో అభివృద్ధి గాంచెను. ఇంతే గాక తల్లిదండ్రులు, పెద్దల ఆశీర్వాదము మరియు గురువుల ఆశీర్వాదము పున్నవారే ఆధ్యాత్మిక అభివృద్ధి పొందెదరు. తల్లి, తండ్రి, గురువు ఈ ముగ్గురిలో ఎవరి సేవ, ఆశీర్వాదము లోపమైనను జ్ఞానప్రాప్తి కలుగదు.కఠోపనిషత్తు చదివిన ఈ విషయము స్పష్టముగును. అందులకే ఇచట శంకరులు గురు, దేవ, వృద్ధులు ఉపాసనాయోగ్యులనిరి.

24) శ్లో॥ఉపస్థితే ప్రాణహరే కృతాంతే
కిమూశు కార్యం సుధియా ప్రయత్నాత్ ।
వాక్కాయ చిత్తైః సుఖదం యమఘ్నం
మురారి పాదాంబుజచింతనం చ ॥

1. ప్ర॥ప్రాణప్రయాణ సమయము ఆసన్నమైనపుడు బుద్ధి మంతులు ప్రయత్న పూర్వకముగా త్వరితముగా ఏమిచేయవలయును?

జ॥ సుఖము నిచ్చునది మరియు మృత్యువును కూడా నశింపచేయునదగు భగవంతుని పాదపద్మములను మనోవాక్కాయములతో చింతన చేయవలయును.

వివరణ : పుట్టిన ప్రతి ప్రాణికి మరణము అనివార్యము. అందులకే పరీక్షిత్తు భాగవతము విని తరించెను. ఖట్వాంగుడు అసురాజు మరణము ఆసన్నమగుచున్నదని విని ఒక ముహూర్త కాలంలో **(40** నిమిషములలో**)** ఉపదేశమును పొంది భగవంతుని స్మరించుచు ముక్తిని పొందెను. పోకన్ మానునే దేహమేవిధమునన్ పోషించి రక్షించినన్ – పాంచభౌతిక శరీరమే అనిత్యమైనపుడు, ఈ ప్రపంచము అనిత్యమనుటలో సందేహమేది ? ప్రపంచము ప్రాపంచిక వాసనలు, మనసులోనే యున్నవి. అందులకే ప్రాపంచిక వాసనలు తొలగించి భగవత్ చింతన చేయవలెననిరి.

25) శ్లో॥కే దస్యవః సంతి కువాసనాఖ్యాః
కః శోభతే యః సదపి ప్రవిద్యః ।
మాతేవ కా యా సుఖదా సువిద్యా ।
కిమేధ తే దానవశాత్సువిద్యా ॥

1. ప్ర॥దారిదోపిడీ దొంగలెవరు ?
జ॥ చెడువాసనలే.

2. ప్ర॥సభలో శోభించు వాడెవడు?
జ॥ మంచి విద్వాంసుడే సభలో శోభించును.

3. ప్ర॥తల్లివలె సుఖము నిచ్చునదేది ?
జ॥ ఉత్తమ విద్యయే.

4. ప్ర॥దానము వలన పెరుగనదేది ?
జ॥ మంచి విద్య దానమువలన పెరుగును.

వివరణ : అజాగ్రత్త మనసులో నున్న చెడువాసనలు మనిషిచే పాపకార్యములు చేయించును. పాపకార్యములవలన సంసారమే గతియగును కాని ముక్తిని పొందలేడు. అరణ్యములో పోవు యాత్రికులను దోపిడిదొంగలు కొట్టి ధనము సామగ్రి తీసికొనిపోయి కండ్లకు, గంతలు కట్టి తప్పుమార్గమును పట్టించెదరు. అట్లే యీచెడు వాసనలు మనిషియొక్క పుణ్యమునంతను నశింపజేసి అధోగతి పాలు చేయును. ఈ చెడువాసనలనుండి బయటపడుటకు ధర్మము ; దైవకార్యములు,

తపస్సు, దానము భగవత్ చింతన మొదలైనవి చేయవలెను ; మరొక మార్గము లేదు. లేనిచో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య, రాగ, ద్వేష, అహంకార, అభిమానములను దోపిడి దొంగలచే నాశనము చేయబడుదురు. మనిషియొక్క విలువ మంచి సంస్కారముల వలన పెరుగును. కుసంస్కారముల వలన తరగును. అంతేగాక చెడువాసనలు గల మనుష్యులు ఈ సమాజమునకు చీడపురుగులు. అందులకే శంకరులు చెడువాసనలను దోపిడిదొంగలనిరి.

పండితుడు సర్వత్రా పూజ్యుడు. బ్రహ్మజ్ఞానుల సభలో యాజ్ఞవల్క్యుడు పూజింపబడినట్లు మంచి విద్వాంసులు సభలో శోభించెదరు. అందులకే ఉత్తమవిద్య తల్లివలె సుఖమునిచ్చుననిరి. ధనము, అన్నము మొదలైనవి దానమిచ్చుట వలన తరగును. కాని, మంచి విద్యదానమిచ్చుట వలన పెరుగును. అందులకే గుణవంతులు విద్యను అమ్ముకొనరు. పోతనామాత్యులు విద్యను అంకితము కూడా ఈయలేదు. విద్యాదానము చేయనివారు, విద్యా విక్రయము చేయువారు బ్రహ్మరాక్షసులై జన్మింతురు. పూర్వము కాశీలోని ఒక వ్యాకరణపండితుడు ఎవరికి విద్యచెప్పని కారణంగా బ్రహ్మరాక్షసుడై తరువాత కొంతకాలమునకు ఒక విద్యార్థికి వ్యాకరణము రాత్రులందే చెప్పిరనియు, విద్యాకాలంలో భిక్షావృత్తిపై జీవించుచు, పగలు ఎవరితో మాట్లాడరాదని నిర్ణయించి విద్యబోధించెను. విద్యపూర్తి అగు సమయమున ఆ విద్యార్థి భిక్షాటన సమయములో దారిలో కొందరు విద్యార్థులు తప్పు అర్థము చెప్పుచుండగా అదిసరిగాదు ఈలాగున చెప్పుకోవలెనని చెప్పెను. రాత్రి గురువైన బ్రహ్మరాక్షసుడు నియమమునకు భిన్నముగా చేసితివి కావున నీకు ఈ విద్య యిక చెప్ప ననెను. అపుడు విద్యార్థి గురుదక్షిణ ఏమి కావలెననిన, ఈ తాళపత్ర గ్రంథములు తీసికొన, గంగ అవతలివైపుకు వెళ్ళి ఒక నమస్కారము పెట్టుమనెను. అట్లు గంగ దాటి విద్యార్థి నమస్కారము చేయగా ఆ పురాతన భవనము నేలమట్టమై బ్రహ్మరాక్షసునకు ఉత్తమగతి అభించెను.

26) శ్లో॥కుతో హి భీతిః సతతం విధేయా
లోకాపవాదాద్భవకాననాచ్చ ।
కో వాతిబంధుః పితరశ్చ కే వా
విపత్సహాయుః వరిపాలకా యే ।

1. ప్ర॥ఎల్లప్పుడు దేని నుండి భయపడవలెను ?
జ॥ లోక నింద నుండియు, మరియు సంసారారణ్యము నుండియు ఎల్లప్పుడూ భయపడవలెను.

2. ప్ర॥అతి ప్రియ బంధువులెవరు ?
జ॥ ఆపదలో సహాయం చేయువాడే అతి ప్రియబంధువు.

3. ప్ర॥తండ్రులు ఎవరు ?
జ॥ అన్ని విధములుగా పాలన, పోషణ చేయువారే తండ్రులు.

వివరణ : సంభావితస్య చాకీర్తిర్ మరణాదతిరిచ్యతే (గీ ॥అ॥ **2-34**) పేరున్న పెద్దమనిషికి నీలాపనిందలు మృత్యువు కన్న అధికమని గీతోక్తి । అరణ్యములో దుర్యోధనుడు గంధర్వులచే పోరాడుచుండగా ఓడిపోవువాని దుస్థితిని చూచి ధర్మరాజు, భీమార్జునులను పంపెను. వారు గంధర్వులను తరిమివేసి దుర్యోధనుని రక్షించిరి. శత్రువుల ద్వారా విడుదల చేయబడినానని సిగ్గుతో దుర్జనుడైన దుర్యోధనుడు కూడా ప్రాయోపవేశమునకు తయారయ్యెను. ఏమియు చేయనప్పటికిని సత్రాజిత్తు కృష్ణుడు శ్యమంతకమణిని ఎత్తుకొనిపోయెనని నిందమోపగా, అతడు సర్వసమర్థుడు గాన జాంబవంతునితో పోరాడి శమంతకమణిని సత్రాజిత్తున కిచ్చి; సత్యభామను బహుమానముగా పొందెను. కృష్ణుడంతటి వాడే నిందలకు వెరచిన సాధారణ జనులగురించి చెప్పనేల ?

అర్థాతురాణాం న గురుర్ న బంధుః
కామాతురాణాం న భయం న లజ్జా ॥

తీవ్ర తృష్ణగలవారు బిడియము, భయము వదిలివేయుదురు. అందుకే తృష్ణ తగ్గించుకొని నిందకలుగు పనులు చేయనిచో భగవంతుని చేరగలరు. అట్లే సంసారాణ్యము నుండి గూడ భయభీతులు కావలెను. ఈ కాలములో శరీరము, ప్రపంచము సత్యముగా భావించి జనులు బొత్తిగా లౌకికతను పెంచుకొనుట కానబడుచున్నది. అనేక విద్వాంసులు, సాధు సన్యాసులు బోధలు కావించుచున్నను మనుషుల యందు పరివర్తన చాలా తక్కువగా కనపడుచున్నది. అటువంటి వారు

సంసారము నుండి భయభీతులు కాలేరు. కాని, ఎవరు భగవద్భక్తికి పాత్రులగుదురో వారి యొక్క సంపదలను దేవుడు మొదట హరించును. ఆ తరువాత తీవ్ర శారీరక అనారోగ్యము నిచ్చును. ఆఖరిలో మిక్కిలి మనోవేదన కలిగించును. ఆ తరువాతనే భక్తిని ప్రసాదించును. అటువంటి భక్తులు సంసార సాగరము దాటుటకై ప్రయత్నించుచు సంసారమునుండి ఎల్లప్పుడూ భయభీతులగు చుందురు.

విపత్తులలో సరియైన సహాయము చేయువారే బంధువులు పూర్తిగా దయకలవారే ఆపదలలో నున్న వారిని చూచి, ఆ ఆపదతనదేనని భావించి సహాయం చేయుచుందురు. సంపదలున్న, జనులు మేము, మేమని చేరుచుందురు. ఆపదలలో పదలిపేయు చుందురు. అట్లుగాక, ఆపదలలో సహాయము చేయువారే సరియైన బంధువులనిరి.

సరియైన తల్లి తండ్రి సంతానమునకు భగవంతునిపై భక్తి, శ్రద్ధలు బోధించుదురు. పొట్టకూటికి చెప్పు చదువులు చదువులు కావు. అట్లే ధర్మాచరణము, భగవద్భక్తి బోధించని తలిదండ్రులు, తల్లిదండ్రులు కాదని చెప్పవచ్చును. అందుకే శంకరులు యిచ్చట అన్ని రకముల పాలన, పోషణ చేయువారే తల్లి తండ్రులనిరి.

27) శ్లో॥బుద్ధ్వా న బోధ్యం పరిశిష్యతే కిం
శివప్రసాదం సుఖబోధరూపమ్ ।
జ్ఞాతేతు కస్మిన్విదితం జగత్స్యా
త్సర్వాత్మకే బ్రహ్మణి పూర్ణరూపే ॥

1. ప్ర॥ఏది తెలుసుకొన్నాక యిక తెలుసుకోవలసిన దుండదు ?

జ॥ జ్ఞానస్వరూపము, ఆనంద స్వరూపము, కళ్యాణ రూపము మరియు శుద్ధము అయిన పరమాత్మను తెలుసుకొనినచో ఇక ఏమీ మిగులదు.

2. ప్ర॥దేనిని తెలిసికొనిన ప్రపంచము తెలియబడును?

జ॥ సర్వత్ర వ్యాపించిన పరిపూర్ణబ్రహ్మమును తెలిసికొనిన ప్రపంచము తెలియబడును.

వివరణ : కస్మిన్ను విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి । అని ఉపనిషద్ వాక్యం. అనగా దేనిని తెలుసుకొనిన అంతయు తెలియబడును. శాస్త్రముల సారమంతయు చెప్పుచూ బ్రహ్మసత్యం, జగన్మిథ్యా, జీవోబ్రహ్మైవ నాపరః । అని శంకరులు నుడివిరి. ప్రతి నిత్యము సుషుప్తిలో జీవుడు బ్రహ్మానుభూతినే పొందుచున్నాడు. సుషుప్తియందు అజ్ఞాన ఆవరణముచే ప్రవేశించుట వలన జాగ్రత్తులోని జీవే అచట కూడా పరిభ్రమించుచున్నాడు. మనస్సు, ఇంద్రియములను ఏకాగ్రముకావించి, జాగ్రదవస్థలో బ్రహ్మానుభూతిని పొందిన, అదే బ్రహ్మజ్ఞానము లేక మోక్షము లేక జీవన్ముక్తి. ఈ జ్ఞానము తరువాత మిగిలినదంతయు నిస్సారమనియు, అనిత్యమనియు, తెలియును. అంతేకాని జ్ఞాని అన్ని భాషలు మాట్లాడగలడు, తెలుసుకొనగలడు అని కాదు అర్థము. అందులకే యిచట శంకరులు పరమాత్మను తెలుసుకొనిన తరువాత ఇక ఏమీ తెలుసుకొనవలసినది లేదనీ, జగత్తు తెలియబడుననీ తెల్పిరి.

28) శ్లో॥కిం దుర్లభం సద్గురురప్తి లోకే
సత్సంగతిర్ బ్రహ్మవిచారణా చ ।
త్యాగో హి సర్వస్య శివాత్మబోధః
కోదుర్జయః సర్వజనైః మనోజః ॥

1. ప్ర॥సంసారములో దుర్లభములైనవి ఏవి ?

జ॥ సద్గురువు, సత్సాంగత్యము, బ్రహ్మవిచారము, సంపూర్ణ త్యాగము, పరమాత్మజ్ఞానము దుర్లభములు.

2. ప్ర॥సర్వులు జయించుటకు కఠినమైన దేది?

జ॥ కామము సర్వులు జయించుటకు కఠినమైనది.

వివరణ : సరియైన జ్ఞానమార్గమును చూపుగురువులు ఈకాలములో చాలా అరుదు. తప్పు త్రోవలు పట్టించు గురువులు, మతములు చాలా ఎక్కువగా నున్నవి. మనస్ఫూర్తిగా ఆ భగవంతునే నమ్ముకొని వానికే జీవిత కైంకర్యము చేయువానికి సద్గురువులు తప్పక లభింతురు.

సత్ అనగా పరమాత్మ; వాని యొక్క సంగమే సత్సాంగత్యము. నిరంతరము పరమాత్మ చింతన సత్సాంగత్యము చేయుచున్నట్లే ! శాస్త్ర అధ్యయనము చేయుచున్న వారు కూడా సత్సాంగత్యము చేయుచున్నట్లే ! ఎవరి పద్ద మీరు కూర్చున్న మీ మనోవేదన తొలగి మీకు శాంతి లభించునో అట్టివారే సత్పురుషులు ; సద్గురువులు. వారి సాంగత్యమేచేయుచుండ వలయును. గీతోపనిషదాదులందు, బ్రహ్మ విచారము గావించబడినది. ఈ గ్రంధముల స్వాధ్యాయము గురుపరంపరగా నేర్చుకొనవలెను. ఆ విధమైన అధ్యయనము, అధ్యాపనము ఈ కాలములో శిథిలమగుచున్నది. స్వాధ్యాయము, బ్రహ్మ విచారము సన్న్యాసులకేగాక గృహస్థులు కూడా కావించి తీరవలెను. ఈ కాలములో సన్న్యాసము స్వీకరించిన వారియందే ఈ బ్రహ్మ విచారము సన్నిగిల్లు చున్నది ; గృహస్థులమాట ఇక వేరుగా చెప్పవలయునా ? సత్సాంగత్యము, సద్గురువు, బ్రహ్మవిచారము, సంపూర్ణత్యాగము, పరమాత్మ జ్ఞానము, దుర్లభములు అని పక్కాణించిరి శంకరులు.

పుత్రైషణ, లోకైషణ, విత్తైషణ, వదలిన వారే త్యాగులు. ఇది బాహ్య త్యాగము. అంతరంగముగా వీనియొక్క వాసనలు కూడా త్యజించి వేయవలయును.కాని గీతలో కృష్ణపరమాత్మ కర్మఫలముల త్యాగమే త్యాగమని గౌణప్రయోగము కావించిరి. తల్లిదండ్రులను త్యజించి, బంధు, బాంధవులని చూడక, నీతి బాహ్యులై జీవించు వారిలో ఈ రోజులలో గౌణత్యాగము కూడా మచ్చుకైనను కానరాకున్నది. అందులకే వేమన సన్న్యాసులను కూడా నిందించుచు, తలల బోడులైన తలపులు బోడులా ? అని వ్రాసెను. ఆఖరిలో ఆత్మ, పరమాత్మల ఐక్యజ్ఞానము దుర్లభమని శంకరులు అన్నారు. స్వామి వివేకానందులు చెప్పినదేమనగా – నూరు మంది మోక్షమునకు బయలుదేరిన అందులో ఎనభైమంది తప్పుత్రోవ తొక్కుచు ఒకవిధమైన మోసగాండ్రగుదురు. మిగిలిన **20** మందిలో **15** మంది పిచ్చివారగుదురు. తక్కిన ఐదుగురు సాధన చేసెదరు. వారిలో ఒకడు బ్రహ్మాత్మైక్యత పొందవచ్చును లేక పొందక పోవచ్చనిరి. గీతలో కృష్ణపరమాత్మ – వెయ్యి మందిలో ఒకరు మోక్షమునకు ప్రయత్నించెదరు ; అట్టివారిలో ఒకానొకడు స్వాత్మానుభవమును పొందును. – అనెను. బహిర్గతజ్ఞానము తెలుసుకొనుట చాలా సులువు. అంతరింద్రియమైన మనస్సును నిగ్రహించి పోరాడుట చాలా కష్టము. అందులకే రామకృష్ణ పరమహంస కోటానుకోట్లలో ఒకరో ఇద్దరో ముక్తిని పొందెదరు అనెను. ఇక, ఉపనిషత్తులు – క్షురస్య ధారా నిశితా దురత్యయా । దుర్గం పథస్తత్కవయో వదన్తి ॥ పదును గల కత్తి అంచుపై నడచుటవలె ఆ మార్గము చాలా నిశితమైనది, పొందశక్యముకానిది, దాటశక్యము కానిది అని బ్రహ్మవేత్తలు అనుచుందురు. అంతేగాక సాధకులు పడుబాధలు ; కష్టమును చూచిన ఈజ్ఞానము కష్టమనే తోచును. రాజకుమారి అయిన మీరాబాయిని విషము త్రాగించి, రాజ్య బహిష్కారముగావించిరి. భాగవతములో ఋషభదేవుని గురించి చెప్పిరి; వారిపై అత్యాచారములు అనేకము గావించిరి. అయినను వారుచలించలేదు. కనుకనే బ్రహ్మాత్మైక్య జ్ఞానము దుర్లభమనిరి. అతి కష్టముగా జయించుటకు వీలైనది కామము. దీనిని గురించి యిదివరకే నుడివితిమి.

29) శ్లో॥పశోః పశుః కో న కరోతి ధర్మం
ప్రాధీతశాస్త్రోఽపి న చాత్మబోధః ।
కింతద్విషం భాతి సుధోపమం స్త్రీ
కే శత్రవో మిత్రపదాత్మజాద్యాః ॥

1. ప్ర॥ పశువులందరిలో పశువెవరు ?
జ॥ శాస్త్రజ్ఞానము కలిగి ధర్మపాలన ఆచరించని వాడు; ఎవనికి ఆత్మజ్ఞానము లేదో వాడు – పశువులలో పశువు.

2. ప్ర॥ అమృతమువలె కన్పించు విషమేది ?
జ॥ స్త్రీయే అమృతము వలె కనిపించు విషము.

3. ప్ర॥ మిత్రుల వలె కనిపించు శత్రులెవరు ?
జ॥ పుత్రాదులు మిత్రుల వలె కనిపించు శత్రువు.

వివరణ : శాస్త్రజ్ఞానము కలిగి, ధర్మపాలన గావించక అందువలన ఆత్మజ్ఞానశూన్యుడైనవాడే పశువులలో పశువు. శాస్త్రము చదివి బుద్ధి స్థాయిలో తెలుసుకొని కేవలము యితరులకు చెప్పట కాదు, శాస్త్రతాత్పర్యము, మననము కావించుకొని, ఆచరణలో పెట్టవలెను. శాస్త్రజ్ఞానము కలిగిన దుర్యోధనుడు ఆచరణలో పెట్టలేదు. అందులకే దుర్గతి పొందెను. వానరరూపములో ఉన్నను ధర్మాచరణము గావించినందున జ్ఞానులలో అగ్రగణ్యుడై ఆంజనేయుడు పూజింప బడుచున్నాడు. నందీశ్వరుడు, పు

పథరూపములోనున్నను, శాస్త్రముల మర్మములెఱిగి, ధర్మసూక్ష్మములు ఆచరించినవాడు గావున నేటికిని పూజింపబడుచున్నాడు. శాస్త్ర అధ్యయనము గావించిన ఎందరో మహానుభావులు భగవన్నామమునే ఉచ్చరించుచు, ధర్మపాలనచే పూజనీయులైరి. శాస్త్రజ్ఞానము కలిగి ధర్మపాలన కావించనివాడు పశుతుల్యుడు గాక మరేమగును. పశువులు తెలియక చేయలేవు ; మనిషి తెలిసివుండిచేయడు; కావుననే వీడొక కల్పిత పశువు. ధరతి ఇతి ధర్మః ప్రపంచమును ధరించుచున్నది; పాలన, పోషణ చేయుచున్నది ఆత్మయే ! ఆత్మచింతన చేయనివాడు పశువులకన్న పశువుగాక యింకేమగును ?

అమృతమువలె కన్పించు విషము స్త్రీయే ! కశ్యపునికి ఇద్దరు భార్యలు వారు దితి, అదితి, దితికి దైత్యులు అనగా రాక్షసులు జన్మించిరి. దితి పతిసేవ బాగుగా చేసి వేళగాని వేళ – సంధ్యవేళ –పతిసమాగమము కోరెను. వారించినను వినలేదు ; ఫలితముగా దైత్యులు ఉద్భవించిరి. అపుడు కశ్యపుడు ఆడువారిని గురించి ఈ విధముగా చెప్పెను – వారి ముఖము చంద్రునివలె ప్రకాశించును; పలుకులు తేనె పలుకులు, హృదయము విషభాండము. అట్లే ఇచ్చట శంకరులు విషమైనను, అమృతమువలె తోచుననిరి. మరల యిచట గుర్తుంచుకోవలసిన విషయమేమనగా సాధ్వీమతల్లులు, బ్రహ్మవిదుషీ మణులు, పతిప్రతలు వారినిగురించి చెప్పిన విషయము కాదుయిది. అటుపంటి వారు పతియొక్క ఆధ్యాత్మిక ఉన్నతికి కూడా తోడ్పడుదురు. పతిలేనిచో లోకకళ్యాణము కావించెదరు. వీరిని గురించి చెప్పినమాట కాదని పాఠకులు గుర్తుంచుకోగలరు. అసలు విషయ మేమనగా సాధకులు జాగ్రత్త వహించుటకు చెప్పిరి. ఉపనిషత్తులలో అరణ్యమీయాత్ అనిరి. గీతలో అరతిర్జన సంసది అనిరి. అనగా, స్త్రీలు లేని స్థలమునే అరణ్యమనిరి ; జనసమూహమునందు రతిలేని వాడని గీతలో అనిరి.

ఇక, మిత్రుడు వలెకన్పించు శత్రువు పుత్రుడనిరి. ఋణానుబంధరూపేణ పశు, పత్నీ, సుతాలయాః । ఋణక్షయే క్షయం యాంతి తత్రకా పరిదేవనా ! అనిరి. పశువులు, పత్ని, సుతులు, గృహము ఋణానుబంధముగా కల్గుచుందురు. ఋణం తీరగానే వారు క్షయమగుదురు. కావున ఈ విషయములో జ్ఞానులు ఏడుపు పొందవలసిన అవసరము లేదనిరి.

సృష్టికర్త బ్రహ్మ మొదలు జరుగుచున్న నాటకమిదే ! బ్రహ్మ తన మానసపుత్రులైన సనకాదులను సృష్టివ్యాపింపజేయుటకు పంపగా వారు సన్న్యసించిరి. దక్షప్రజాపతి రెండుసార్లు నూరుమంది పుత్రులను సృష్టి వ్యాపింపజేయుటకు పంపగా నారదుని ఉపదేశము వలన సన్న్యసించిరి. అపుడు దక్షుడు కన్యలను సృష్టించి వారికి వివాహము కావించి సృష్టిని పెంపొందించెను. వశిష్ఠపుత్రుడు శక్తి తండ్రిమాట వినక గంధర్వులతో పోరాడి మృతుడయ్యెను. పరాశరపుత్రుడైన వ్యాసుడు తండ్రితో వాదించి తపస్సుకు పోయెను. అతని కొడుకు శుకుడు, వ్యాసుడు వ్యామోహముతో ఎంతపిలిచనను వినక అవధూత ఆయెను. ఇవన్నియు పాత కాలపు మాటలు. ఆకాలములోనే కేవలము తండ్రి మాట వినని వారుండిరి అనికాదు. ఈకాలములో సంపదకొఱకు పుత్రులు, శత్రువులవలె అగుట చూచుచునే యున్నాము. ఉదాహరణకు మైసూరు మహారాజు కొడుకు తండ్రిపై వ్యాజము వేసెను. న్యాయాలయమునకు వెళ్లవలసి వచ్చిన రోజున మహారాజు అవమానము భరించలేక విషముత్రాగి మరణించెను. నీతికారులు – అర్థాతురాణాం సగురుర్ సబంధుః అనిరి. ధనపిశాచి ఆవహించిన వారు గురుబంధువులను లెక్కచేయ రనిరి. కనుక ధనాశకు లోబడిన పుత్రులు మిత్రులవలె కనిపించినను శత్రువులనుట సరియే !

30) శ్లో॥విద్యుచ్చలం కిం ధనయౌవనాయుర్
దానం పరం కించ సుపాత్రదత్తమ్ ।
కంఠంగతైర్ అపి అసుభిర్న కార్యం
కిం కిం విధేయం మలినం శివార్చా ॥

1. ప్ర॥ విద్యుత్‌వలె క్షణికమైన దేది ?
జ॥ ధన, యౌవన, ఆయుష్షులు విద్యుత్ వలె క్షణికములు.

2. ప్ర॥ ఉత్తమదానమేది ?
జ॥ సుపాత్రునికిచ్చిన దానము ఉత్తమమైనది.

3. ప్ర॥ అవసానకాలములో కూడా ఏది చేయరానిది ? ఏది చేయవలసినది ?

జ॥ అవసానకాలము దాపురించినను పాపము చేయరాదు. పరమాత్మ చింతన కావింపవలయును.

వివరణ : లక్ష్మి చంచలము ; యౌవనము క్షణికము; ఆయువు బుద్బుద ప్రాయము; కనుకనే ధన, యౌవనములు వున్నను గర్వించ రాదు. చిన్ననాటి నుండియే దైవచింతన చేయవలెను. ఎందులకనగా, కాలగతిలోనికి ఎపుడు జారుకుందుమో తెలియదు.

అందులకే ధన, యౌవన, ఆయువులు విద్యుత్‌వలె క్షణికములు.

మంచి పుణ్యక్షేత్రములలో (మంచి కాలములో) పర్వదినములలోను, సుపాత్రునకిచ్చిన దానము ఉద్ధరించును. ఎవరికి ఏ వస్తువు అవసరమో, దానిని వారికి దానమిచ్చినను మధ్యమ ఫలము నిచ్చును. దేశకాల పాత్రల ననుసరించి సుపాత్రున కిచ్చిన దానము అధిక ఫలము నిచ్చును. అమావాస్య, సంక్రమణము, గ్రహణ సమయము, పితృపక్షములలో, శ్రాద్ధదినములలో పితరులకు వదలిన నువ్వులు – నీళ్ళు అధికఫలము నిచ్చును. ఎట్లనగా, అగ్నిలో వేసిన ఎండుమిరపకాయ పొగఘాటు ఇరుగుపొరుగువారికి తగిలి, దగ్గుట మొదలిడెదరు. అట్లే మంత్రయుక్తముగా అగ్నిలోవేసిన ఆహుతులు ఏ కొంచెమైనను అనంతఫలము నిచ్చును. అట్లే సుపాత్రుని కిచ్చిన దానము అనంతఫలమునిచ్చును.

అవసాన కాలమాసన్నమయినను పాపము చేయరాదు, భగవచ్చింతన చేయవలెను. అంత్యకాలములో ఏస్మరణము చేయుదురో దానిచే ప్రేరితులై అదే జన్మము పొందెదరు. పూర్వజన్మలో మరణకాలమున జింకను స్మరించి భరతుడు జింకజన్మ పొందెను. ఎండలోనుంచిన అద్దము సూర్యరశ్మిని అనేకరెట్లు ప్రతిఫలింపజేయును ; అట్లే జీవుని అంతఃకరణము సర్వత్ర వ్యాపకమైన పరమాత్ముని అనేక రెట్లు పెంచి ప్రతిబింపజేయును. అందులకే జీవుని ధ్యానచింతనల ఫలితము అనేకరెట్లు పెరుగును. అందుకే చెడు చింతనలు, పాపకర్మములు చేసి వాతావరణము కలుషితము చేయుటకన్న, ఏ కొంచెమైనా పుణ్యకర్మలు చేయుచు, కొద్ది క్షణములు నిశ్చింతగా భగవంతుని చింతన చేసిన సమాజ సేవ చేసిన వారమగుదుము.

31) శ్లో॥అహర్నిశం కిం పరిచింతనీయం
సంసారమిథ్యాత్వ శివాత్మతత్త్వమ్ ।
కిం కర్మ యత్ ప్రీతికరం మురారేః ।
క్వాస్థా న కార్యా సతతం భవాబ్ధౌ ॥

1. ప్ర॥ రాత్రింబగళ్ళు విశేషముగా దేని చింతనచేయవలయును ?
జ॥ సంసారము మిథ్యయనియు, ఆత్మ, పరమాత్మ, ఒకటే అనియు చింతన చేయవలయును.

2. ప్ర॥ నిజమైన కర్మ యేది ?
జ॥ భగవంతునికి ప్రీతికరమైనదే నిజమైన కర్మ.

3. ప్ర॥ ఎల్లప్పుడూ దేనిమీద విశ్వాసముంచరాదు ?
జ॥ సంసార సాగరము మీద ఎన్నడూ విశ్వాసముంచరాదు.

వివరణ : సంసారము మిథ్యయని ముందుకూడా చెప్పినాము. ఇచట సంసారము యొక్క మిథ్యాత్వమును ఎల్లప్పుడూ స్మరించు చుండవలెననిరి. కూడబెట్టిన ధనమును సంరక్షించుచుండవలెను లేనిచో దొంగలపాలగును; అట్లే మిథ్యాత్వము తెలుసుకొనిన తరువాత, ఎల్లప్పుడూ దానిని మననము చేయుచు, ఆ మిథ్యాత్వమును సర్వదా అనుభవించుచుండవలెను. రామకృష్ణపరమ హంసవారు – ఈ జగత్తే సత్యమయిన నా గ్రామము సంతను బంగారముతో కప్పివేసి యుండెడి వాడను, అనిరి. భారతవర్షము జ్ఞానులకు, మహాజ్ఞానులకు పుట్టినిల్లు. త్రైలింగస్వామి కాశీలో గంగ ఒడ్డున ఉన్న యిసుకపై మండుటెండలో కూడా శరీరధ్యాస వదలి పరుండెడివారు. ఆ ఎండలలో తిరుగుటే కష్టము ; కాని పగలంతయు యిసుకతిన్నెల పైనే గడిపెడివారు. ప్రపంచముతో పాటు శరీర మిథ్యాత్వమును అనుభవించిన మహాపురుషులు వారు, అందులకే అధమపక్షము సామాన్యులు జగత్‌యొక్క మిథ్యాస్వరూపమును ఎప్పుడూ స్మరించవలెను. సర్వం ఖలు ఇదం బ్రహ్మ। ఈదృశ్య ప్రపంచమంతయును బ్రహ్మమే ! అయం ఆత్మా బ్రహ్మ ! పంచ కోశాతీతము ఆత్మచైతన్యము ; అదే బ్రహ్మము. స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు చేతనము కల్గించు ఆత్మ మనలో నున్నదని అనుభవించిన మాత్రమున జ్ఞానము కలుగదు. సర్వవ్యాపకమైన చైతన్యము అంతటా యున్నదని అనుభవించినా జ్ఞానము కాదు. ఈ రెండు చైతన్యములు వేఱుగాదు; ఒకటే !

అని అనుభవించిననే జ్ఞానము కలుగును. ఉపనిషత్తుల సారము మహావాక్యములు. ఆ మహావాక్యములు కూడా ఈ విషయమునే చాటుచున్నవి. అందులకే యిచట బ్రహ్మాత్మైక్య చింతన సర్వదా కావించవలెనని చెప్పిరి.

భగవంతునికి ప్రీతికరమైనదే అసలైన కర్మ. దీనిని స్వామి వివేకానందులు ఈ విధముగా చెప్పిరి. ఒక జమీందారుకు పెద్ద తోట గలదు. ఆ తోటలో తోటమాలులు ఇద్దరుండెడివారు. అందులో ఒకడు యజమాని తోటకు రాగానే, ఆహా ! యజమాని ఎంత అందగాడు ; వాని ముక్కు , చెవులు చాలా బాగున్న వని వర్ణించుచూ వాని ముందు నాట్యము చేసెడివాడు. రెండవవాడు శ్రమకోర్చి కూరగాయలు, పండ్లు బాగుగా పండించి యజమాని యింటికి తలపై మోసుకొనివెళ్లి యిచ్చెడివాడు. ఇపుడు మీరే చెప్పగలరు ; యజమానికి ఎవరు కృపా పాత్రులో ? అట్లే, భగవంతుని అందరిలో చూచుచు, అందరికి సేవ చేయువారిపై భగవత్కృప త్వరగా కల్గును. ఈ చెప్పిన దృష్టాంతములో యజమానియే పరమాత్మ. కొంతమంది కేవలము వానిని స్తుతించెదరే కాని ఆ భగవంతుని సంతానమైన జీవరాశికి సేవచేయరు. తోట జీవరాసులతో సమానము. వారికి సేవచేయు వాడు త్వరగా సద్గతిని పొందును. అందులకే గీతలో - పరమాత్మ అందరిలోనూ తనను, తనలో అందరిని చూచువాడే యోగి అనిరి. అట్టివాడే నా ఆత్మస్వరూపుడు ; నాకు అత్యంత ప్రియుడు అనిరి.

ఎన్నడూ సంసారసాగరమును విశ్వసించరాదు, సంసారము అనిత్యమైననూ, దుఃఖాలయమైననూ జనులందు ప్రవేశించి సత్యము, నిత్యమని తలచి కాలమును వ్యర్థముగావించి, అంత్యకాలములో శోకింతురు. పృద్ధాప్యములో ఏ సాధన సరిగా చేయలేక తపనపడుచు, దుఃఖింతురు అట్లుగాక ఈ సంసారసాగరమును విశ్వసింపక చిన్న నాటి నుంచి ఎల్లప్పుడూ భగవంతుని స్మరణచేయువారు తరింతురు.

32) శ్లో॥కంఠంగతా వా శ్రవణంగతా వా
ప్రశ్నోత్తరాఖ్యా మణిరత్నమాలా ।
తనోతు మోదం విదుషాం సురమ్యం
రమేశగౌరీశకథేవ సద్యః ॥

తా॥ ఈ ప్రశ్నోత్తరి మణిరత్నమాలను పఠించువారికి మరియు వినువారికి లక్ష్మీపతియైన విష్ణువు, గౌరీపతియైన శంకరుల కథ వలె విద్వాంసులకు అద్భుతానందమును పెంపొందించును.

ఇందలి ఉపదేశములను ఆచరించువారు జీవన్ముక్తులగుటలో సందేహము లేదు.

శ్రీశంకరాచార్య కృత
నిర్వాణ షట్కమ్

1. మనో బుద్ధ్యహంకార చిత్తాని నాహం
న చ శ్రోత్ర జిహ్వే న చ ఘ్రాణ నేత్రే
నచ వ్యోమ భూమి ర్న తేజో న వాయుః
చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్

నేను మనసును - బుద్ధిని - అహంకారాన్ని - చిత్తాన్ని కాను. నేను శ్రోతాన్ని - జిహ్వను - ఘ్రాణాన్ని - నేత్రాన్ని కాను. నేను - ఆకాశాన్ని - భూమిని - అగ్నిని - వాయువును కాను. నేను చిదానంద స్వరూపుడును, శివుడను, శివుడను.

2. న చ ప్రాణ సంజ్ఞో న వై పంచ వాయు
ర్న వా సప్త ధాతు ర్నవా పంచ కోశాః ।
న వా క్పాణిపాదౌ, న చోపస్థపాయూ:
చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్ ॥

నేను ప్రాణాన్ని –పంచవాయువులను – సప్తధాతువులను – పంచకోశాలను – వాక్కు, పాణి, పాద, ఉపస్థ, పాయువులను కాను. నేను చిదానంద స్వరూపుడను, శివుడను, శివుడను.

3. నమే ద్వేష రాగౌ న మే లోభమోహం
మదో నైవ మే నైవ మాత్సర్యభావః
న ధర్మో న చార్థో న కామో న మోక్షః
చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్ ॥

నాకే రాగద్వేషాలు, లోభమోహాలు, మదమాత్సర్యాలు, ధర్మార్థ కామమోక్షాలు ఏవీలేవు. నేను చిదానంద స్వరూపడను, శివుడను, శివుడను.

4. న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం
న మంత్రో న తీర్థం న వేదా న యజ్ఞాః ।
అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా
చిదానందరూపః శివోఽహం శివోఽహమ్ ॥

నాకు పుణ్యపాపాలు, సుఖదుఃఖాలు, మంత్ర తీర్థాలు, వేద యజ్ఞాలు ఏవీలేవు. నేను భోజనం – భోజ్యం – భోక్తా ఏవీ కాను నేను చిదానందస్వరూపుడను, శివుడను – శివుడను.

5. న మే మృత్యు శంకా నమే జాతి భేదః
పితా నైవ మే నైవ మాతా న జన్మ ।
న బంధు ర్న మిత్రం గురుర్నైవ శిష్యః
చిదానంద రూప శివోఽహం శివోఽహమ్ ॥

నాకు మృత్యువూ – మృత్యుభయమూ, జన్మ – జాతి ఏవీ లేవు. నాకు తల్లీ – తండ్రీ – బంధుమిత్రాదులు – గురుశిష్యులు ఎవరూ లేరు. నేను చిదానంద స్వరూపుడను. శివుడను, శివుడను.

6. అహం నిర్వికోల్పో నిరా కార రూపో
విభుత్వాచ్చ సర్వత్ర సర్వేంద్రియాణామ్
న చా సంగతం నైవ ముక్తిర్న మేయః
చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్ ॥

నేను నిర్వికల్పుడను – నిరాకారుడను – విభుడను – సర్వేంద్రియాలలో సర్వత్ర వ్యాపించి ఉన్నాను. నాకు సంగం లేదు. ముక్తి లేదు. నేను చిదానంద స్వరూపుడును, శివుడను, శివుడను,

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ।